# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 12 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు గురువారం 17 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :12 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE THU 17 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## లక్ష్యాలు చేరకపోతే ఈ సమావేశాలెందుకు?

### ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చంద్రబాబు

- 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం
- అన్ని వర్గాలను బలోపేతం చేసేలా రుణాలు అందించాలని బ్యాంకర్లకు చంద్రబాబు సూచన
- రుణాల మంజూరులో కొన్ని బ్యాంకులు వెనుకబడటంపై సీఎం అసంతృప్తి
- రుణాల చెల్లింపులో ఎస్హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 అని ప్రశంస
- పీఎం సూర్యఘర్ పథకానికి పెద్దఎత్తున రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- కౌలు రైతులకు రుణసాయం పెంచాలని బ్యాంకులకు దిశానిర్దేశం




పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని అన్ని రంగాలను, వర్గాలను బలోపేతం చేసేలా రుణాలను అందించాలని, లక్ష్యాలను చేరుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. అమరావతిలో బుధవారం జరిగిన 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన పాల్గొని, వివిధ అంశాలపై అధికారులకు, బ్యాంకర్లకు కీలక దిశానిర్దేశం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేనప్పుడు ఇలాంటి సమావేశాలు నిర్వహించి ప్రయోజనం ఏముంటుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రుణాల మొత్తం గతంతో పోలిస్తే పెరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో మంజూరు జరగలేదు. కొన్ని బ్యాంకులు ఇంకా వెనుకబడే ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి" అని అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యం ఉందని, ఇందుకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు అందించి సహకరించాలని కోరారు.స్వయం సహాయక సంఘాల (ఎస్హెచ్‌జీ) మహిళలు రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. "రుణాలు తీసుకున్న వారిలో 99 శాతానికి పైగా మహిళలు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు. ఈ విషయంలో ఏపీ ఎస్హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలిచారు. కేవలం 0.67 శాతం మంది మాత్రమే చెల్లింపుల్లో విఫలమవుతున్నారు. వీరి నుంచి బకాయిలు వసూలు చేసేందుకు 'వన్ టైమ్ సెటిల్‌మెంట్' (ఓటీఎస్) విధానంపై ఆలోచించాలని బ్యాంకులకు సూచిస్తున్నాను" అని వివరించారు. రాష్ట్రంలో 15 శాతం ఆర్థిక వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ఎల్‌నినో కారణంగా కొంత ఇబ్బందికర పరిస్థితి తలెత్తిందని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రతికూలతలను అధిగమించి ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాష్ట్ర వ్యవసాయ రంగంలో కీలకమైన కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేందుకు బ్యాంకులు చొరవ చూపాలని ఆయన కోరారు.

## తిరుమలలో హైటెక్ ఆధ్యాత్మికత.. మ్యూజియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు..

- తిరుమలను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక నమూనాగా తీర్చిదిద్దుతామన్న సీఎం
- రూ.104 కోట్లతో ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం 32 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి
- తిరుమల వచ్చే ప్రతి భక్తుడికి రూ.2 లక్షల బీమా సౌకర్యం
- రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం

2లో



## ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు.. ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?

- చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- ఎఫ్‌బీఐగా నటిస్తూ ఏపీ పోలీసులు సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని కోరారని వెల్లడి
- ఇది ప్రభుత్వ ప్రాయోజిత మోసమంటూ జగన్ విమర్శ
- ఈ చర్యతో ఏపీ పరువు తీశారంటూ మండిపడ్డ మాజీ సీఎం
- హామీల అమలుపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి హితవు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చంద్రబాబు గారి రెడ్ బుక్

- మిగతా 2లో





### స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే చంద్రబాబు సంక్షేమ డ్రామా ఆడుతున్నారని వైసీపీ విమర్శ
- కొత్త ప్రభుత్వం వచ్చాక అర్హులకు పెన్షన్లు ఇవ్వడం లేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపణ
- దాదాపు 6 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులను తొలగించారని విమర్శ
- జగన్ తెచ్చిన జీవోతోనే అసైన్డ్ భూములకు హక్కులు దక్కుతున్నాయని వెల్లడి
- కేంద్రం కేటాయించిన ఇళ్లు నామమాత్రమేనని వ్యాఖ్య

- మిగతా 2లో

## వివేకా హత్య కేసు నిందితులకు సీబీఐ కోర్టులో ఎదురుదెబ్బ

- డిశ్చార్జ్ పిటిషన్లు వేసిన గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి
- పిటిషన్లకు విచారణార్హత లేదన్న కోర్టు
- నిందితులపై అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో నాంపల్లిలోని ప్రత్యేక సీబీఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. తమపై నమోదైన తీవ్ర అభియోగాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ ప్రధాన నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లను న్యాయస్థానం నిర్ద్వంద్వంగా

- మిగతా 2లో



## జీరం ఘాటీ నరమేధం కేసులో చారిత్రక తీర్పు..

## 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష

- 2013లో కాంగ్రెస్ పార్టీ పరివర్తన్ యాత్రపై దాడి
- మావోల దాడిలో 29 మంది దుర్మరణం
- 10 మంది మావోలకు ఉరిశిక్ష విధించిన ఎన్ఐఏ న్యాయస్థానం


పెన్ పవర్ డెస్క్:ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జీరం ఘాటీ వద్ద 2013లో కాంగ్రెస్ 'పరివర్తన్ యాత్ర' కాన్వాయ్‌పై దాడి చేసిన మావోయిస్టులు 29 మందిని అతి దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ దాడి కేసులో జగదల్‌పూర్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన మొత్తం 10 మంది మావోయిస్టులకు

- మిగతా 2లో

## ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన

- ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- శనివారం సాయంత్రానికి అల్పపీడనం ఏర్పాటుకు సూచనలు
- ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశం
- ప్రభావంతో వచ్చే వారం రాష్ట్రంలో వర్షాలు కురిసే ఛాన్స్
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిక వెల్లడి

- మిగతా 2లో







## భార్య ముక్కు కొరికేసిన భర్త... మంచిర్యాలలో దారుణం

- భార్య ముక్కు కొరికేసిన భర్త
- మంచిర్యాల జిల్లాలో జరిగిన దారుణ ఘటన
- కాపురానికి రావడం లేదన్న కోపంతో భర్త దాడి
- అడ్డువచ్చిన మామపై కూడా కర్రతో దాడి
- వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి బాధితురాలు తరలింపు

- మిగతా 2లో



## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..

### నెల్లూరులో ఆధునిక పాఠశాలలను ప్రారంభించిన మంత్రి లోకేశ్

- నెల్లూరులో ఆధునికీకరించిన ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ ప్రభుత్వ స్కూళ్లను ప్రారంభించిన మంత్రి
- వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆర్ఎస్ఆర్ స్కూల్‌కు కార్పొరేట్ హంగులు
- డిజిటల్ తరగతులు, రోబోటిక్స్ ల్యాబ్, సింథటిక్ క్రీడా ప్రాంగణం వంటి ప్రత్యేకతలు
- పాఠశాల పనితీరుపై సమీక్ష.. ఉత్తీర్ణత శాతం పెంచాలని అధికారులకు లోకేశ్ ఆదేశం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఇతర టీడీపీ నేతలు

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా నెల్లూరు నగరంలో మరో ముందడుగు పడింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో

- మిగతా 2లో

## సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు



- కేంద్ర విమోచన వేడుకలకు అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరణ
- రాష్ట్రంలో 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహణ
- సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వేడుకలు

- మిగతా 2లో

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

పెన్ పవర్ డెస్క్: సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# రావాలి అవంతి అంటున్న వైసీపీ !

నాకొద్దీ పార్టీ అని మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు ఇప్పటికి రెండేళ్ళ క్రితం వైసీపీని వీడిపోయారు. చిత్రంగా ఇపుడు వైసీపీకి ఆయనే అవసరం అవుతున్నారు అని అంటున్నారు. భీమునిపట్నం వైసీపీ ఇంచార్జిగా ఉన్న చిన్న శ్రీను టీడీపీలో చేరిపోయారు. ఆయన పార్టీని వీడి పది రోజులకు దగ్గర పడుతున్నా భీమిలీ వైసీపీ ఇంచార్జిగా ఎవరిని ఎంపిక చేయాలో తెలియక ఆ పార్టీ సతమతం అవుతోంది. వైసీపీకి భీమిలీ ఇపుడు అతి పెద్ద పరీక్ష పెడుతోంది. విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడిని, అలాగే నెల్లిమర్ల వైసీపీ ఇంచార్జిని వెంటనే నియమించిన వైసీపీ అధినాయకత్వం భీమిలీ విషయంలో మాత్రం ఏమీ పాలుపోక ఆగిపోయిందా అన్న చర్చ వస్తోంది. ఎందుకంటే భీమిలీ టీడీపీకి కంచుకోట. అక్కడ వైసీపీని నడపడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకే అర్థబలం అంగబలం ఉన్న నేతల కోసం పార్టీ చూస్తోంది.

**వైసీపీ సర్వేలో ఆయనే :**

ఇదిలా ఉంటే భీమిలీ నియోజకవర్గానికి కొత్త వైసీపీ ఇంచార్జిగా ఎవరిని నియమించాలి అన్న దాని మీద పార్టీ అంతర్గత సర్వే నిర్వహిస్తే మెజారిటీ క్యాడర్ తో పాటు నాయకులు అంతా అవంతికి జై కొట్టారని తెలుస్తోంది. అవంతి 2019 నుంచి 2024 మధ్యలో వైసీపీలో ఎమ్మెల్యేగా మంత్రిగా పనిచేశారు. విశాఖ వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా ఆయన ఉన్నారు. ఆయన బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పాటు అంగబలం అర్థ బలానికి లోటు లేదు. ఇక 2009లో ప్రజా రాజ్యం నుంచి ఒకసారి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అలా ఆయనకంటూ సొంత బలం అనుచర గణం ఉంది. అందువల్ల ఆయనకే పార్టీ బాధ్యతలు అప్పగిస్తే భీమిలీలో కూటమిని ధీటుగా ఎదుర్కొంటారు అని అంటున్నారు. ఇది భీమిలీ మెజారిటీ వైసీపీ నేతల మాటగా ఉంది.

**ఇంతకీ ఆయన వస్తారా :**

అయితే ఇదంతా ఒంటి చేతి చప్పుడు మాదిరిగానే ఉంది అంటున్నారు. వైసీపీ తన సర్వేలు తాను చేస్తోంది. అందులో అవంతి పేరు కూడా జోడించింది. అందరూ అవంతి కావాలని కోరుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది కానీ ఇంతకీ అవంతి శ్రీనివాసరావు వైసీపీలోకి తిరిగి చేరుతారా అన్నదే పెద్ద చర్చగా ఉంది. ఆయన 2024 డిసెంబర్ లో వైసీపీకి రాజీనామా చేశారు. అప్పట్లో ఆయన ఆలోచనలు కూటమిలో చేరాలని. అందుకే వైసీపీ మేయర్ ని దించడానికి కార్పోరేటర్ గా ఉన్న తన కుమార్తె చేత కూడా వైసీపీకి వ్యతిరేకంగా ఓటేయించి టీడీపీ కూటమికి జీవీఎంసీ దక్కేలా చేశారు. అయితే టీడీపీలో ఆయన రాకను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వ్యతిరేకించడంతో ఆగింది అని అంటున్నారు.

**తగిన మూల్యం చెల్లిస్తోంది :**

జనసేనలో ఆయనను చేర్చుకోవడానికి కూడా స్థానికంగా అంగీకారం లేదని చెబుతున్నారు. ఈ కారణాల వల్లనే ఆయన ప్రస్తుతం ఖాళీగా ఉన్నారు అని అంటున్నారు. డీలిమిటేషన్ మీద అవంతి ఆశలు పెట్టుకున్నారు. సీట్లు పెరిగితే కనుక కూటమి పార్టీలలో చేరి మళ్ళీ పోటీ చేయాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో అవంతి వైసీపీలో చేరుతారు అన్నది ఎంతవరకూ జరుగుతుంది అన్నది పెద్ద ప్రశ్నగా ఉంది. ఒకవేళ మనసు మార్చుకుని అవంతి వైసీపీలో చేరితే మాత్రం వైసీపీకి గండం గట్టెక్కినట్లే అంటున్నారు. మొత్తానికి చూస్తే గతంలో వైసీపీలో ఎంతో మంది నాయకులు ఉన్నారు. కానీ ఎన్నికల వేళ వారిని అందరినీ దూరం చేసుకున్న పాపానికి ఇపుడు వైసీపీ తగిన మూల్యం చెల్లిస్తోంది అని అంటున్నారు.

## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..

- మొదటి పేజి తరువాయి

అత్యంత ఆధునికంగా అభివృద్ధి చేసిన రెండు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన నెల్లూరు చేరుకోగా, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహా పలువురు జిల్లా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు.ముందుగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చెందిన వీపీఆర్ ఫౌండేషన్ అందించిన రూ.8.3 కోట్ల ఆర్థిక సహకారంతో సమూలంగా ఆధునికీకరించిన ఆర్.ఎస్.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నూతన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

**కార్పొరేట్ హంగులతో ఆర్ఎస్ఆర్ స్కూల్**

వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఈ పాఠశాలలో మొత్తం 43 తరగతి గదులను అందుబాటులోకి తెచ్చారు. డిజిటల్ బోధన కోసం ప్రతి గదిలో ఎల్ఈడీ స్క్రీన్లు, ఆధునిక బెంచీలు ఏర్పాటు చేశారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు ప్రయోగాత్మక, సాంకేతిక విద్య అందించేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లను సిద్ధం చేశారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేయడం విశేషం. చదువుతో పాటు క్రీడలకు కూడా పెద్దపీట వేస్తూ పాఠశాలలో ఎకరం విస్తీర్ణంలో విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టును, అవుట్‌డోర్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం మూలపేట 39వ డివిజన్‌లో రూ.13.4 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆధునికీకరించిన దేవిరెడ్డి శారద (డీఎస్ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను కూడా లోకేశ్ ప్రారంభించారు.

**ఫలితాలపై దృష్టి పెట్టండి: మంత్రి లోకేశ్**

పాఠశాలల ప్రారంభోత్సవం అనంతరం, ఆర్.ఎస్.ఆర్. పాఠశాల పనితీరుపై ప్రధానోపాధ్యాయుడు, ఇతర అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. కేవలం భవనాలు నిర్మిస్తే సరిపోదని, విద్యా ప్రమాణాలు, ఫలితాలు కూడా మెరుగుపడాలని స్పష్టం చేశారు. గతేడాది పదో తరగతిలో కేవలం 60.19 శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు, ఎన్‌రోల్‌మెంట్ ఎందుకు తగ్గుతున్నాయని ఆరా తీశారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.షరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు.. ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?

- మొదటి పేజి తరువాయి

పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

"చంద్రబాబు గారూ, ఇది పోలీసింగా? లేక రాజకీయ వేధింపుల కోసం చేస్తున్న ప్రభుత్వ ప్రాయోజిత మోసమా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించేందుకు ఏపీ పోలీసులే తమ అధికారిక ఈమెయిల్ నుంచి 'ఎక్స్'కు అభ్యర్థన పంపారని, కానీ అభ్యర్థన పంపిన సంస్థ పేరుగా 'ఎఫ్‌బీఐ'ని పేర్కొన్నారని 'ఎక్స్' సంస్థే ధ్రువీకరించింది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఎఫ్‌బీఐ పేరును ఎందుకు దుర్వినియోగం చేశారు?" అంటూ జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు.సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల వైఫల్యం, డీఎస్సీ స్కామ్, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికే ఈ కుట్ర చేశారా? అని ఆయన నిలదీశారు. పోలీసు యూనిఫాం చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించిందని, రాజకీయ సెన్సార్‌షిప్ కోసం కాదని హితవు పలికారు. ఈ చర్య ద్వారా విదేశీ దర్యాప్తు సంస్థ పేరును రాజకీయాల్లోకి లాగి ఆంధ్రప్రదేశ్ పరువును తీశారని, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు.

విమర్శకుల గొంతు నొక్కేందుకు వెచ్చిస్తున్న శక్తిని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలుపై పెట్టాలని జగన్ సూచించారు. కరవుతో ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవడం, ఉద్యోగాలు సృష్టించడం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టడం వంటి పనులు చేయాలన్నారు. ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్‌తో కాకుండా పనితీరు, పారదర్శకతతో సమాధానం చెప్పాలని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## తిరుమలలో హైటెక్ ఆధ్యాత్మికత.. మ్యూజియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు..

తిరుమలను ప్రపంచస్థాయి పవిత్ర దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ఓ గొప్ప నమూనాగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతను ఆధ్యాత్మికతతో సమన్వయం చేస్తూ భక్తులకు అద్భుతమైన అనుభూతిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా, బుధవారం తిరుమలలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రూ.104 కోట్ల భారీ వ్యయంతో టీసీఎస్ ట్రస్ట్ ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియంతో పాటు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన 'పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను ఆయన భక్తులకు అంకితం చేశారు.భక్తులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను తీర్చిదిద్దారు. ఇందులో శ్రీవారికి జరిగే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలతో పాటు తిరుమల క్షేత్రంలోని వివిధ ప్రాంతాలను 3డీ సాంకేతికత ద్వారా కళ్లారా వీక్షించే అవకాశం కల్పించారు. 6డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా శ్రీవారి దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా స్వీకరించి, ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం, ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియాన్ని సీఎం ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీనివాసుని కల్యాణ ఘట్టం వంటి విశేషాలను భక్తులకు సులభంగా అర్థమయ్యేలా ఇందులో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణదేవరాయలు వంటి మహారాజులు స్వామివారికి సమర్పించిన ఆభరణాల 3డీ నమూనాలు, చారిత్రక వస్తువులు, స్వామివారి కిరీటాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పానోరమిక్ స్క్రీన్‌పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో రూపొందించిన శ్రీవారి పరిణయ వీడియోను ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. ఆనాటి సంగీత విద్వాంసులు వాడిన వాయిద్య పరికరాలను కూడా పరిశీలించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మరికొన్ని కీలక ప్రకటనలు చేశారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికి ఎల్ఐసీ భాగస్వామ్యంతో ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. దీని ద్వారా తిరుమలలో దురదృష్టవశాత్తూ భక్తుడు మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల నుంచి కూడా ఆలయ నిర్మాణానికి విజ్ఞప్తులు వస్తున్నాయని చెప్పారు.అనంతరం, తిరుమలలో భక్తుల సౌకర్యార్థం రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. నారాయణగిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, దాతల ప్రతినిధులు సుచిత్రా ఎల్లా, నితిన్ సేత్‌లతో కలిసి ఆయన ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణించారు. తిరుమలలో పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే కొండపై 89.5 శాతం పచ్చదనం ఉందని గుర్తుచేశారు. ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణ, సేవ, ఆధునిక సాంకేతికత వంటి ఆరు కీలక అంశాల ప్రాతిపదికన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి వివరించారు.

## ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనువైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం (సెప్టెంబర్ 19) సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

ఈ అల్పపీడనం రాబోయే 3-4 రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడనుందని అధికారులు తెలిపారు. అనంతరం ఇది దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ అల్పపీడనం ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు

ప్రజలకు తెలియజేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని అధికారులు కోరారు.

## సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు

హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సీఏపీఎఫ్ బలగాల పరేడ్‌ను పరిశీలించనున్నారు. గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహిస్తోంది.

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు.ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ రోజును ఏ పేరుతో నిర్వహించాలన్న దానిపై తెలంగాణలో కొన్నేళ్లుగా రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, 2023లో 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నుంచి 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా వేడుకలు నిర్వహిస్తోంది.

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

- మొదటి పేజి తరువాయి

అలముకున్నాయి. గ్రామంలోని వినాయక విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడిపోయారు. వెంటనే స్పందించిన గ్రామస్థులు.. గల్లంతైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతులను నరసింహ(21), తేజ(17), సిద్దార్థ(17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు.

**ఘటనపై మంత్రి పొన్నం తీవ్ర దిగ్భ్రాంతి**

గణేశ్ నిమజ్జనం సందర్భంగా శిరీష ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతి తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. సహాయక చర్యలు, ఘటనకు సంబంధించిన పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు, పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు నీటిలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రమాదకరమైన, లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రజలు అక్కడికి వెళ్లకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## వివేకా హత్య కేసు నిందితులకు సీబీఐ కోర్టులో ఎదురుదెబ్బ

- మొదటి పేజి తరువాయి

కొట్టివేసింది.కేసులో ఏ1 ఎర్ర గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్ రెడ్డి, ఏ6 గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు డిశ్చార్జ్ పిటిషన్లను సమగ్రంగా విచారించిన కోర్టు, వాటికి ఎలాంటి విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్లు, సాంకేతిక ఆధారాలు, సమర్పించిన సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... నిందితులపై ఉన్న అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టం చేసింది.

## స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలపై బూటకపు ప్రచారం చేస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం, జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ఇప్పుడు ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది.తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరించి మహిళలు, రైతులు, యువత సహా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ అవే హామీలను వల్లె వేస్తున్నారని ధ్వజమెత్తారు.చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బలహీన వర్గాలకు, మహిళలకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయలేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరు చేసిన తేదీ నుంచి కాకుండా, బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు తమ పింఛన్ల దరఖాస్తుల ఆమోదం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.జగన్ హయాంలో వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు అందేవని, చంద్రబాబు ఆ సమర్థవంతమైన వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏదో ఒక సాకు చూపి లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తున్నారని, జగన్ హయాంలో దాదాపు 69 లక్షల మందికి పింఛన్లు అందగా, చంద్రబాబు ప్రభుత్వం సుమారు ఆరు లక్షల మందిని తొలగించిందని ఆరోపించారు. ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి లేమిని స్పష్టం చేస్తోందన్నారు.అసైన్డ్ భూములపై చంద్రబాబు చేస్తున్న ప్రచారాన్ని శ్రీకాంత్ రెడ్డి తప్పుదోవ పట్టించే చర్యగా అభివర్ణించారు. పదేళ్లుగా వివాదాస్పద అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న వారికి పట్టా హక్కులు కల్పించే జీవోను జగన్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ భూములను ఫ్రీహోల్డ్ ఆస్తులుగా మార్చడం ఆ జీవో ఫలితమేనని, కానీ దీనిని తమ ఘనతగా చెప్పుకుంటూ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ంరాష్ట్రానికి 5 లక్షల ఇళ్లు కేటాయించామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పడంపై స్పందిస్తూ.. జగన్ ప్రభుత్వం మహిళల పేరు మీద పంపిణీ చేసిన 30 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలతో పోలిస్తే ఇది చాలా తక్కువని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

## భార్య ముక్కు కొరికేసిన భర్త... మంచిర్యాలలో దారుణం

తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో ఓ కిరాతక ఘటన వెలుగుచూసింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో ఆగ్రహానికి లోనైన భర్తే, భార్య ముక్కు కొరికి తీవ్రంగా గాయపరిచాడు. ఈ అమానుష ఘటన బుధవారం కొటపల్లి మండలంలో చోటుచేసుకుంది.మణిచందర్, మమత దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరగగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా మమత తన పుట్టింట్లోనే నివసిస్తోంది. ఈ క్రమంలో భార్యను తిరిగి తన వెంట తీసుకెళ్లేందుకు మణిచందర్ నేడు అత్తవారింటికి వెళ్లాడు.అయితే మమతను పంపేందుకు ఆమె తండ్రి నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన మణిచందర్ తన మామపై కర్రతో దాడి చేశాడు. భర్తను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మమతపై కూడా అతను విచక్షణారహితంగా దాడి చేసి, ఆమె ముక్కును కొరికేశాడు. ఈ ఘటనలో బాధితురాలి ముక్కు భాగం తీవ్రంగా దెబ్బతింది.స్థానికులు వెంటనే స్పందించి బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను వరంగల్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జీరం ఘాటీ నరమేధం కేసులో చారిత్రక తీర్పు.. 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష

- మొదటి పేజి తరువాయి

మరణశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.2013లో జీరం ఘాటీ అటవీ ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా మావోయిస్టులు జరిపిన ఆకస్మిక దాడిలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అగ్రనాయకత్వం తుడుచుపెట్టుకుపోయింది. ఈ దారుణ నరమేధంలో కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, నాటి పీసీసీ అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్, 'సల్వా జుడుం' వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మా సహా మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు.దోషులపై భారత శిక్షా స్మృతిలోని హత్య, కుట్ర సెక్షన్లతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎన్ఐఏ కోర్టు ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. భారత రాజకీయ మరియు భద్రతా చరిత్రలో చోటుచేసుకున్న అతిపెద్ద తీవ్రవాద దాడుల్లో ఒకటైన ఈ కేసులో 13 ఏళ్ల తర్వాత బాధితుల కుటుంబాలకు న్యాయం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# కొత్త పింఛన్లకు మరో రెండు రోజులు గడువు!

## -అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించాలి

## -క్షేత్రస్థాయిలో కచ్చితంగా వెరిఫై చేయాలి -కలెక్టర్ పి. రాజాబాబు





**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం సెప్టెంబర్ 16:**

రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ గడువును మరో రెండు రోజులు పొడిగించిన నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరం నుంచి మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మరో రెండు రోజులు దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పించినందున అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలని సూచించారు. ప్రత్యేక కేటగిరీ కింద వచ్చే దరఖాస్తులను సంబంధిత శాఖల అనుమతులు తీసుకున్న అనంతరం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**వైద్యపరమైన పింఛన్లపై ప్రత్యేక దృష్టి...**

వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి ప్రస్తుతం నాలుగు రకాల పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. బోదకాలు, క్రానిక్ డిసీజెస్, లెప్రసీ, కిడ్నీ--లివర్--హృదయ మార్పిడి వంటి వైద్య పరిస్థితులకు సంబంధించిన దరఖాస్తులను మండల అధికారులు ప్రత్యేక దృష్టితో పరిశీలించాలని సూచించారు.ప్రతి వారం జిల్లా స్థాయిలో, ప్రజాప్రతినిధులు, మంత్రులు నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో అధిక సంఖ్యలో పింఛన్లకు సంబంధించిన దరఖాస్తులు అందుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా, కచ్చితత్వంతో దరఖాస్తులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చూడాలని, పింఛన్ల మంజూరు విషయంలో ప్రతికూల వార్తలకు తావులేకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పింఛన్ అనేది లబ్ధిదారులకు జీవితాంతం అందే ఆర్థిక భరోసా అని కలెక్టర్ పేర్కొన్నారు. విధుల్లో అశ్రద్ధ వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**మంచినీటి సమస్య రాకుండా చర్యలు...**

ఎల్‌నినో ప్రభావంతో మంచినీటి కొరత ఏర్పడకుండా మండల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మరమ్మతులు అవసరమైన బోర్లను వెంటనే బాగు చేసి ప్రజలకు తాగునీరు అందించాలని ఆదేశించారు. మంచినీటి సరఫరాను మండల పరిషత్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో ప్రజలు, అధికారులు ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ నారాయణ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చిరంజీవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు సచివాలయాల అధికారి వెంకటేశ్వరరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

## మార్కాపురం - ప్రకాశం

# పట్టణంలోనీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

## రెండెవరోజుకూడా బైక్ పై వెళ్ళి ప్రజల నీటి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 16**

పట్టణంలో తీవ్రంగా నెలకొన్న నీటి ఎద్దడిని స్వయంగా తెలుసుకునేందుకు గౌ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి రెండవ రోజు కూడా బైక్‌పై వార్డుల్లో సుడిగాలి పర్యటన చేపట్టారు. రాచర్ల రోడ్డులోని పూల బజార్, మసీద్ బజార్, భూపాల్ రెడ్డి కాలనీ, ఎస్.టి. కాలనీ, శివరంగారెడ్డి బజార్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో నేరుగా మాట్లాడి వారి నీటి సమస్యలను తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. ఎండిపోయిన బోర్ పాయింట్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి, ప్రజలు నీటి కోసం ఎటువంటి ఇబ్బందులు పడకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు అధికారులు, సిబ్బంది, వాటర్ బోర్డు సభ్యులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# రాత్రివేళ ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు





**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 16:**

రాత్రివేళల్లో ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాల వల్ల జరిగే రహదారి ప్రమాదాలను నివారించేందుకు వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టి.వి. నాగలక్ష్మి సూచించారు. మంగళవారం కందుకూరులోని పామూరు రోడ్డు కూడలి, జాతీయ రహదారి 167బీ పరిధిలోని కొండముడుసుపాలెం కూడలి వద్ద రవాణా శాఖ ఆధ్వర్యంలో ట్రాక్టర్ ట్రైలర్లకు రేడియం స్టిక్కర్లు అతికించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టి.వి. నాగలక్ష్మి మాట్లాడుతూ కేవలం జరిమానాలు విధించడం తమ ఉద్దేశం కాదని, రహదారి ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాత్రివేళల్లో, చీకటి సమయంలో వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల ట్రాక్టర్లతో పాటు అన్ని రవాణా, భారీ వాహనాలకు ప్రతిబింబించే రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరని పేర్కొన్నారు.ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులను రాత్రివేళల్లో తరలించే ట్రాక్టర్లు తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వరి ధాన్యం, చెరకు తదితర వ్యవసాయ ఉత్పత్తులను తరలించే ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు లేకపోతే నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు ఈ విషయాన్ని గమనించి తమ వాహనాలకు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

**వెనుక లైట్లు పనిచేయకపోవడంతో ప్రమాదాలు...**

కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి జే. అనిల్‌కుమార్ మాట్లాడుతూ చాలా వరకు ట్రాక్టర్ల వెనుక లైట్లు, దిశ సూచికలు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. రాత్రివేళల్లో రహదారి పక్కన ట్రాక్టర్లను నిలిపినప్పుడు, అలాగే నెమ్మదిగా ప్రయాణిస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, కార్లకు అవి సరిగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాక్టర్ల వెనుక రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడం వల్ల దూరం నుంచే వాహనం ఉన్నట్లు వెనుక నుంచి వచ్చే వాహనదారులకు స్పష్టంగా కనిపిస్తుందని, దీంతో వారు ముందుగానే వేగాన్ని తగ్గించుకుని ప్రమాదాలను నివారించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రహదారి భద్రతలో భాగంగా వాహనదారులు నిబంధనలను పాటిస్తూ తమ వాహనాలకు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని రవాణా శాఖ అధికారులు సూచించారు.

# భక్తి పారవశ్యంలో గణపతి నిమజ్జనాలు..!

## అంగరంగ వైభవంగా మూడో రోజు వినాయక నిమజ్జనాలు -పోలీసుల ఆంక్షలు పాటిస్తూనే వేడుకల నిర్వహణ

## డప్పు చప్పుళ్లు, నినాదాలతో హోరెత్తిన పురవీధులు -నిమజ్జన కార్యక్రమంలో ప్రముఖులు, రాజకీయ నాయకుల సందడి

## ఇంకా కొనసాగుతున్న ప్రత్యేక పూజలు, భజనలు



**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 16**

పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను భక్తులు ఆటపాటల నడుమ ఘనంగా నిమజ్జనం చేశారు.

**పోలీసుల ఆంక్షలు పాటిస్తూనే వేడుకల నిర్వహణ..**

నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ముందస్తుగా ఆంక్షలు విధించింది. భక్తులు, ఉత్సవ కమిటీలు పోలీసుల సూచనలను తూచా తప్పకుండా పాటిస్తూ వేడుకలను ప్రశాంత వాతావరణంలో కొనసాగించారు. ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వాహకులు నిమజ్జన ఊరేగింపులను నిర్వహించారు.




**డప్పు చప్పుళ్లు, నినాదాలతో హోరెత్తిన పురవీధులు..**

వినాయక మండపాల నుండి గణనాథులను తరలిస్తూ యువకులు, భక్తులు డప్పు వాయిద్యాలు, కోలాటాలతో ఉత్సాహంగా నృత్యాలు చేశారు. గణపతి బప్పా మోరియా, జై బోలో గణేష్ మహరాజ్ కీ జై అంటూ చేసిన నినాదాలతో పురవీధులు మార్మోగిపోయాయి. భక్తుల ఉత్సాహం, భక్తి పారవశ్యం మధ్య నిమజ్జనాలు కన్నుల పండువగా సాగాయి.

**నిమజ్జన కార్యక్రమంలో ప్రముఖులు, రాజకీయ నాయకుల సందడి..**

మూడో రోజు జరిగిన నిమజ్జన కార్యక్రమంలో స్థానిక రాజకీయ నాయకులు, వివిధ పార్టీల ప్రముఖులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. నాయకుల రాకతో నిమజ్జన ప్రాంతాల్లో సందడి నెలకొంది.

**ఇంకా కొనసాగుతున్న ప్రత్యేక పూజలు, భజనలు..**

మరోవైపు మూడో రోజు నిమజ్జనం చేయని మండపాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. మిగిలిన విగ్రహాల నిమజ్జనాలను కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

# కృష్ణం శెట్టిపల్లిలో ఏకకాలంలో ఐదు ఇళ్లపై దొంగల దాడి

## మూడు ఇళ్లలో చోరీ.. రెండు ఇళ్లలో ఏమీ దొరకకపోవడంతో తాళాలు పగలగొట్టి పరార్

## తాళాలు ఇళ్లనే టార్గెట్ చేసిన దుండగులు -రంగంలోకి క్లూస్ టీమ్



**గిద్దలూరు పెన్ వర్ సెప్టెంబర్ 16**

గిద్దలూరు మండలం కృష్ణం శెట్టిపల్లి గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. సోమవారం రాత్రి ఒకేసారి ఐదు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడటం గ్రామంలో కలకలం రేపింది. తాళాలు వేసి ఇంట్లో ఎవరూ లేని ఇళ్లను గుర్తించి, వాటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు విలువైన నగదు, బంగారం, వెండి ఆభరణాలను అపహరించినట్లు బాధితులు తెలిపారు. ఒకే రాత్రి ఐదు ఇళ్లపై దాడి చేయగా.. మూడు ఇళ్లలో దొంగలకు నగదు, బంగారం, వెండి ఆభరణాలు లభించడంతో వాటిని ఎత్తుకెళ్లారు. మరో రెండు ఇళ్లలో ఎలాంటి విలువైన వస్తువులు లభించకపోవడంతో తాళాలు పగలగొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

**రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ**

గ్రామానికి చెందిన కే. రమేష్‌బాబు రైల్వేలో విధులు నిర్వహిస్తూ గద్వాల్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దొంగలు ఇంటి తలుపు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం బీరువాను తెరిచి అందులోని సామగ్రిని చిందరవందర చేసి, 28 తులాల వెండి, 32 గ్రాముల బంగారం, రూ.17 వేల నగదు అపహరించినట్లు బాధితుడు తెలిపారు. ఇంటికి తిరిగి వచ్చిన రమేష్‌బాబు గేటు పగలగొట్టి ఉండటాన్ని గుర్తించి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా ఉండటంతో చోరీ జరిగి నట్లు గమనించారు.


**మరో ఇంట్లోనూ బంగారం, వెండి, నగదు అపహరణ**

అదేవిధంగా ఆర్మీలో పనిచేసిన సింగరయ్య భార్య కూడా సొంత గ్రామంలోని అమ్మగారింటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలోని సామగ్రిని చిందరవందర చేసి రూ.15 వేల నగదు, 4 గ్రాముల బంగారం, 10 తులాల వెండి అపహరించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన సమయంలో తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు.

**వృద్ధురాలి ఇంట్లోనూ చోరీ**

మరోవైపు అదే గ్రామానికి చెందిన కృపమ్మ అనే వృద్ధురాలు హైదరాబాద్‌కు వెళ్లి ఉండగా, ఆమె ఇంటిని కూడా దుండగులు లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు ఒక ముక్కుపుడక, రూ.6 వేల నగదు, అర తులం వెండి ఆభరణాలు తీసుకెళ్లినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ఇలా ఒకే రాత్రి ఐదు ఇళ్లను టార్గెట్ చేయడం, తాళాలు వేసి ఉన్న ఇళ్లలోనే దొంగలు చోరీలకు పాల్పడ్డారు.



**రంగంలోకి క్లూస్ టీమ్**

చోరీలపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని వివరాలు సేకరించారు. చోరీ జరిగిన ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించిన క్లూస్ టీమ్ దొంగల ఆనవాళ్ల కోసం గాలించింది. ఇళ్లలో, తలుపులు, బీరువాలు తదితర ప్రాంతాల్లో లభించిన వేలిముద్రలను సేకరించినట్లు సమాచారం. పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దొంగలు ఒకే ముఠాకు చెందినవారా? ముందస్తుగా ఇళ్లను రెక్కీ నిర్వహించారా? అనే కోణాల్లోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఊరికి వెళ్లే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సభ్యులంతా బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. విలువైన బంగారం, నగదు తదితరాలను ఇళ్లలో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# మెగా సెగ్రిగేషన్ డ్రైవ్ ను విజయవంతం చేయాలి

### -జిల్లా కలెక్టర్ రాజాబాబు






**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం సెప్టెంబర్ 16**

ఈనెల 19వ తేదీన నిర్వహించే 'మెగా సెగ్రిగేషన్ డ్రైవ్' విజయ వంతంగా నిర్వహించడంలో సచివాలయ ఉద్యోగులు కూడా చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని సచివాలయాల సిబ్బందితో బుధవారం సాయంత్రం రిమ్స్ ఆడిటోరియంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం ఉన్న ఒంగోలు నగరాన్ని ఒక ఐకానిక్ సిటీగా యావత్ ప్రపంచానికి తెలిసే రీతిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ' మీరు పని చేస్తున్న నగరానికి ఈ ప్రత్యేక గుర్తింపు తీసుకురావాల్సిన బాధ్యత మీపైనా ఉంది ' అని ఉద్యోగులలో స్ఫూర్తిని నింపారు.

**భాగస్వాములకు లక్కీ డ్రా**

ప్రతి కుటుంబం ఈ డ్రైవ్ లో పాల్గొనేలా అవగాహన కల్పించాలని సచివాలయ ఉద్యోగులకు కలెక్టర్ సూచించారు. శానిటరీ డివిజన్ల వారీగా భాగస్వాముల వివరాలతో లక్కీ డ్రా తీసి, విజేతలకు గోల్డ్ కాయిన్ ఇస్తామని ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో మెప్మా పీడీ నారాయణ, మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, అసిస్టెంట్ కమిషనర్ నగేష్, మున్సిపల్ ఇంజనీర్ యెషయా, డీ.ఈ.ఈ. పద్మజ, శానిటరీ సూపర్వైజర్ పిచ్చయ్య పాల్గొన్నారు.

# నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులకు డీజే అనుమతులు లేవు

### ప్రశాంత ఆధ్యాత్మిక వాతావరణంలో వినాయక నిమజ్జనం చేయండి -సిఐ సురేష్



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 16**

గిద్దలూరు మండల ప్రజలు వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ విజ్ఞప్తి చేశారు. నిమజ్జనం చేసే సందర్భంలో నిర్వహించే ఊరేగింపులో డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకోరాదని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేస్తే ఆ సౌండ్ సిస్టన్ని స్వాధీనం చేసుకొని కోర్టులో అప్పగిస్తామని తెలిపారు. అలానే గిద్దలూరు మండలం కంచిపల్లి సమీపంలోని కంచిపల్లి చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమం ప్రశాంతంగా శాంతియుతంగా ముగిసేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# బెల్లంకొండ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నిమజ్జనం

**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 16**

మండలంలోని కంబాలపాడు గ్రామంలో గల బెల్లంకొండ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నిమజ్జన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రాంగణంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి మూడు రోజులపాటు విశిష్ట పూజలు నిర్వహించి, అనంతరం బుధవారం సాయంత్రం ఎంతో వైభవంగా ఊరేగింపుగా వినాయక విగ్రహాన్ని తీసుకుని వెళ్లి , నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వినాయక లడ్డూను బెల్లంకొండ కళాశాల విద్యార్థులు వేలంపాటలో 41, 5 0 0 రూపాయలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ విద్యాసంస్థల అధినేతలు బెల్లంకొండ శ్రీనివాసరావు, ధర్మపత్ని విజయలక్ష్మి, వీరి శెట్టి విద్యాసంస్థల కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు, బెల్లంకొండ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ మెహరాజ్, తోట శ్రీనివాసులు, వి సత్యనారాయణ, కే వెంకటేశ్వర్లు తోపాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన బాల్యం

### -అంగన్వాడీ కేంద్రాల్లో పోషణపై అవగాహన - పిల్లల ఎత్తు, బరువు పరిశీలన

### -ఆహార వైవిధ్యం, ప్రోటీన్‌తో కూడిన భోజనంపై తల్లులకు అవగాహన

**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 16**

కందుకూరు ప్రాజెక్ట్ అర్బన్ ఏ సెక్టార్ పరిధిలోని కృష్ణానగర్ అంగన్వాడీ కేంద్రంతో పాటు మోతాదువారిపాలెంలో 9వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రతిరోజూ అందిస్తున్న తాజా వేడి భోజనం, వారానికి రెండు రోజులు ఎగ్ ఫ్రైడ్ రైస్, ప్రతిరోజూ గుడ్డు, పప్పుకూరలు, ఆకుకూరలు వంటి పోషకాహార పదార్థాల గురించి తల్లులకు వివరించారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన ప్రోటీన్లు, ఇతర పోషకాలు సమృద్ధిగా లభించేలా ఆహారం తీసుకోవాలని సూచించారు. బాలసంజీవని కిట్ వినియోగంపై సూచనలు తల్లులకు అందజేస్తున్న బాలసంజీవని కిట్‌లోని రాగిపిండి, అటుకులు, బెల్లం, చిక్కీ, ఖర్జూరం వంటి పోషక పదార్థాలను క్రమం తప్పకుండా వినియోగించాలని సూచించారు. వీటి వినియోగం ద్వారా తల్లులు, పిల్లలకు అవసరమైన పోషకాలు అందడంతో పాటు రక్తహీనత నివారణకు దోహదపడుతుందని వివరించారు. ఈ ఏడాది రాష్ట్రీయ పోషణ మాసోత్సవంలో ప్రధానంగా



ఆహార వైవిధ్యం--తగిన ప్రోటీన్, అంగన్వాడీ కేంద్రాల్లో తాజాగా భోజనం, సమాజ భాగస్వామ్యం--బాధ్యత, పోషణ--బాల్య ప్రేరణ, ప్రధానమంత్రి మాతృ వందన యోజన అనే ఐదు అంశాలపై అవగాహన కల్పించారు.

**చిన్నారుల ఎత్తు, బరువు పరిశీలన...**

కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ సిబ్బంది చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించి వారి ఎదుగుదలను నమోదు చేశారు. అలాగే




నవచేతన కార్యక్రమం గురించి కూడా తల్లులకు వివరించారు. పిల్లల ఆరోగ్యం, పోషణ విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ యు. ప్రభావతి, అంగన్వాడీ టీచర్లు జరీనా, షాహినా, దివ్య, కరీమా, ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, బాలకోటేశ్వరమ్మ, శ్రీదేవి, ఆయాలు శ్రీదేవి, మనోజ తదితరులు పాల్గొన్నారు.

# అవకాశమిస్తే గిద్దలూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

### కామూరి రమణారెడ్డి -ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..



**గిద్దలూరు:పెన్ పవర్ సెప్టెంబర్ 16**

గిద్దలూరు నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కామూరి రమణారెడ్డి తెలిపారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. బుధవారం నాడు ఆయన స్థానిక పాత్రికేయుల సమావేశ ఏర్పాటు చేసి తన మనోగతాన్ని వివారిమాచారు. ఈ సందర్భంగా కామూరి రమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై పనిచేయడం తనకు ఎప్పటి నుంచో అలవాటేనని తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు

### నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారం కోసం తన స్థాయిలో నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలే ప్రాధాన్యంగా పనిచేస్తూ, వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రయాణంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి పనిచేసే అవకాశం లభించిందని కామూరి రమణారెడ్డి తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తాను పనిచేశానని పేర్కొన్నారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు అవకాశం కల్పిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కామూరి రమణారెడ్డి వెల్లడించారు. తనకు అవకాశం లభిస్తే నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల సమస్యలు, మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, సాగునీరు, యువతకు ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా ప్రజలతో కలిసి పనిచేయాలన్నదే తన ఉద్దేశమన్నారు. పదవి కంటే ప్రజలతో ఉన్న అనుబంధమే ముఖ్యమని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తానని తెలిపారు. ప్రజలు అవకాశం ఇస్తే వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా. గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే నా ముందున్న ప్రధాన లక్ష్యం”లి అని కామూరి రమణారెడ్డి పేర్కొన్నారు. ప్రజలతో మమేకం.. సమస్యలపై నిరంతర పోరాటం సలుపుతానన్నారు. ప్రజల సమస్యలను కేవలం వినడంతో ఆగకుండా, వాటి పరిష్కారానికి సంబంధిత వర్గాలతో చర్చించి ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని కామూరి రమణారెడ్డిపేర్కొన్నారు . గిద్దలూరు నియోజకవర్గ ప్రజల ఆదరణ, సహకారంతో భవిష్యత్‌లో మరింత విస్తృతంగా ప్రజా కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

# బంజరు బీడు భూమితోనూ ఆదాయం!

### -జీ.వీ.ఏ. పెంపుపై జిల్లా యంత్రాంగం దృష్టి



**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం సెప్టెంబర్ 16:**

సాగులోలేని బంజరు బీడు భూములను కూడా ఆదాయ వనరుగా మార్చటంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ దిశగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయ తీరు, సేద్యం చేయకుండా వదిలేసిన భూములపై సమీక్షించారు. రెగ్యులరుగా ఖరీఫ్, రబీ పంటలు సాగు చేసే భూములు కాకుండా వినియోగంలో లేని బంజరు బీడు భూములపై ఆరా తీశారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెప్తున్న నేపథ్యంలో రైతులకు, పశు పోషకులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూడాలన్నారు. వినూత్న విధానాలను అమలు చేయడం ద్వారా వారి ఆదాయం పెరిగేలా దృష్టి సారించాలన్నారు. బంజరు బీడు భూములలో గడ్డి, ఇతర పండ్ల మొక్కలు పెంచడం ద్వారా ఆదాయంతో వారి జీవీఏ పెంచవచ్చన్నారు. ఈ దిశగా బంజరు బీడి భూములను గుర్తించి భూయజమానులతో మాట్లాడి కమ్యూనిటీ ఫార్మింగ్ దిశగా ముందుకు వచ్చేలా చూడాలన్నారు. వాతావరణంలో వేడిని తగ్గించేందుకు కూడా ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ఈ విధంగా గడ్డి, ఇతర పండ్ల మొక్కలను పెంచేందుకు స్థలాన్ని గుర్తించాలని అధికారులకు కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, ఏపీఎంఐపీ పిడి శ్రీనివాసులు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్ పాల్గొన్నారు.

# సాగుకు నోచుకోని ప్రతి ఎకరాకు ఆర్థిక సాయం అందించాలి -కిసాన్ మోర్చా

**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 16:**

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో కందుకూరు నియోజకవర్గంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాళ్లపాడు ప్రాజెక్ట్, గుడ్లూరు మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రాళ్లపాడు జలాశయాన్ని సందర్శించిన కిసాన్ మోర్చా నాయకులు, అక్కడి నీటి పరిస్థితిని పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జలాశయంలో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోవడంతో ప్రస్తుతం పైప్‌లైన్ ద్వారా కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ఎటుచూసినా బీడు భూములే కనిపిస్తున్నాయని, సాగు లేక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అనంతరం గుడ్లూరు మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. వర్షాలు లేక పంటలు సాగు చేయలేని పరిస్థితుల్లో రైతులు నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారని కిసాన్ మోర్చా నాయకులు



తెలిపారు. వర్షాభావం కారణంగా సాగుకు నోచుకోని ప్రతి ఎకరాకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి రైతులకు అండగా నిలవాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా తరపున కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తగిన ఉపశమన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కావూరి వాసు, జనరల్ సెక్రటరీ ఎస్. రమేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ సురేష్, రాళ్లపాడు రైతు సంఘాల చైర్మన్ వెంకటేశ్వర్లుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# శీలంవారిపల్లి లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

### పూజా కార్యక్రమాలలో పాల్గొన్న భక్తులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 16**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీటీసీ మునగల వెంకటనారాయణరెడ్డి గణేష్ ని ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేయగా భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఈ సందర్భంగా మునగల వెంకటనారాయణరెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పండుగ ప్రజల్లో ఆధ్యాత్మికతతో పాటు ఐకమత్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం గ్రామంలో వినాయక ఉత్సవాలను కమిటీ సభ్యులు, యువత, భక్తులు కలిసికట్టుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవాల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమాలలో తీకెనం లక్ష్మీనారాయణ, పెన్నం దామోదర్, కొట్టే వెంకయ్య, ముత్యాల నరేష్, సుంకరి అంజినాద్రి, ముడియాల గోపి, షేక్ నాయబ్ రసూల్, మస్తాన్ రెడ్డి, కదిరి సూరి, గంజరపల్లి గురు వర్ధన్ , సన్నీ మరియు గ్రామస్తులు భక్తులు విఘ్నేశ్వర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గణనాధుడు అందరికి మంచి చేయాలి



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 16**

విఘ్నాలు తొలగించే గణ నాధుడు ఆపదలు ఆటంకాలు తొలగించి అందరికి మంచి చేయాలని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ మన్నే రవీంద్ర అన్నారు. బుధవారం మీల్లంపల్లి గ్రామపంచాయతీలోని వేగినాటి కోటయ్య కాలనీలో ఏర్పాటుచేసిన వినాయక చవితి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి వినాయక స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా మన్నే రవీంద్ర ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ చేకూరి ఆంజనేయులు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు షేక్ జిలాని, మాజీ మండల రైతు సంఘం అధ్యక్షుడు పోతిరెడ్డి రమణారెడ్డి, విగ్నేష్ యూత్ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# తన శ్వాస ఉన్నంతవరకు జగనన్నతోనే

# అవకాశం వస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా -కామూరి రమణారెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 16**

గిద్దలూరు వైసీపీ నాయకులు కామూరి రమణారెడ్డి తనపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తాను జనసేనలోకి వెళ్తున్నామని వస్తున్న ప్రచారాలను ఖండిస్తూ తన ఊపిరి ఉన్నంత వరకు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డితో కలిసి పని చేస్తానని ఆయనను సీఎం చేసుకోవడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. 2024 ఎన్నికలలో వైసిపి పార్టీకి వ్యతిరేకంగా పనిచేశానని ఇన్చార్జి నాగార్జున రెడ్డి ఫిర్యాదు చేశారన్న ఆరోపణలపై రమణారెడ్డి తీవ్రంగా స్పందించారు. తాను ఒక సాధారణమైన కుటుంబం నుంచి వచ్చి వైసిపికి పనిచేస్తున్నానని అన్నారు. అంతేకాకుండా గతంలో వైసిపి గుర్తుపై గెలిసిన అశోక్ రెడ్డి పార్టీని వీడి టీడీపీ లోకి వెళ్లిన సమయంలో కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ బలోపేతం చేసేందుకు తమ కుటుంబం కృషి చేసిందన్నారు. గిద్దలూరు వైసిపి ఇన్ ఛార్జ్ నాగార్జున రెడ్డి తో పాటు వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేలగా పోటీ చేసి గెలుపొందిన చరిత్ర ఉందని అలాంటి వారు ఇలా మాట్లాడటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానున్నారు. జగనన్న ఆదేశాలతో వెంకటేశ్వర స్వామి, ప్రజల ఆశీస్సులతో అవకాశం వస్తే ఎమ్మెల్యేగా పోటీ చేసి జగనన్నకు గిద్దలూరు ఎమ్మెల్యే సీటును కానుకగా ఇస్తానన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి కొమరోలు మండలంలో కాముri కుటుంబం స్వయంగా కార్యకర్తల వద్దకు వెళ్లి పలకరించడమే కాకుండా పది సంవత్సరాలపాటు తమ కుటుంబాన్ని ఆదరిస్తున్న వారికి కృతజ్ఞతలు చెబుతామని రమణారెడ్డి వెల్లడించారు. సుభోజనం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో పేదలందరికీ ఇంటికే ఆహారాన్ని అందించే కార్యక్రమం ఇప్పటికి చేపట్టినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తామని రమణారెడ్డి తెలిపారు. ఈనెల 27వ తేదీన కొమరోలులో సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలానే అదేరోజు కొమరోలు మండలంలో సుభోజనం కార్యక్రమాన్ని చేపడుతున్నామని రమణారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు ఆర్డీ రామకృష్ణ , బాదం గోపాల్ , రాఘవరెడ్డి , బాలయ్య, వీరం రెడ్డి మోహన్ రెడ్డి , మురళి , వాసుదేవ రెడ్డి, నల్లగుంట్ల సర్పంచ్ ప్రసాద్ , శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వేలం పాటలో భారీ ధర పలికిన గణనాథుని లడ్డు ప్రసాదం



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 16**

గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామంలో శ్రీ భవాని శంకర స్వామి ఆలయ సమీపం లో ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక విగ్రహం వద్ద గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పూజా కైంకర్యాలు నిర్వహించారు. బుధవారం నిమజ్జన కార్యక్రమం చేపట్టారు . ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం స్వామివారి లడ్డు ప్రసాదానికి శివాలయం టెంపుల్ యూత్ నిర్వహించిన వేలం పాటలో గండు రామిరెడ్డి రూ .50,116/- లకు పాట పాడి దక్కించుకున్నారు. వినాయక ఉత్సవ కమిటీ లడ్డూ ప్రసాదాన్ని గండు రామిరెడ్డికి అందించారు.

## ఎంపీడీవోను కలిసిన బిజెపి నాయకులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 16**

రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్ల వివరాలపై బ బుధవారం మండల బిజెపి అధ్యక్షుడు పాశం రామకృష్ణ, జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చక్రపాణిని కలిసి మండల పరిధిలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, బూత్ ల వివరాలు, ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల పరిస్థితి తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో పార్టీ తరఫున క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాల సమాచారాన్ని సేకరించినట్లు తెలిపారు.

## భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన దుగ్గా సరళ రెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 16**

మండలంలోని బొంతవారిపల్లి గ్రామంలో వినాయక చవితి పండుగ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుగ్గా రాజశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం దుగ్గా సరళరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య వినాయక స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించి, భక్తులు స్వామివారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొంది మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భోజనం స్వీకరించారు. దుగ్గా రాజశేఖరరెడ్డి జ్ఞాపకార్థం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దుగ్గా సరళరెడ్డిని విఘ్నేశ్వర కమిటీ నిర్వాహకులు అభినందించారు.



# ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా వైద్య శిబిరాలు

## కందుకూరులో పలు సేవా కార్యక్రమాలు - ఉన్నం భాస్కరరావు

**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 16:**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప కార్యక్రమాల్లో భాగంగా కందుకూరు పట్టణంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు ఉన్నం భాస్కరరావు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఆయురారోగ్యాలు మెండుగా కలగాలని, దేశ ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సెప్టెంబర్ 17న ఉదయం 9.30 గంటలకు కందుకూరు పట్టణంలోని గ్రామదేవత అంకమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.అనంతరం ఉదయం 10 గంటలకు టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని, స్థానిక వాసవి నగర్ కాలనీలో హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**సాయంత్రం 'ఆశీర్వాద దీపం' కార్యక్రమం...**

అదేవిధంగా సాయంత్రం 7 గంటలకు కోవూరు రోడ్డు 5వ లైన్ ప్రారంభంలో 'ఆశీర్వాద దీపం' సామూహిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉన్నం భాస్కరరావు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాల్లో పట్టణ ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయాలని కోరారు.



# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి -సీపీఐ నేతల డిమాండ్



**పుల్లల చెరువు పెన్ పవర్ సెప్టెంబర్ 16**

మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలు ప్రాంతాల్లో పంట పొలాల్లో నీరు చేరడంతో పాటు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లింది. మండలంలోని రైతు సిద్ధనబోయిన వెంకటేశ్వర్లు సాగు చేసిన అరటి తోట కూడా వర్షం, ఈదురుగాలుల ప్రభావంతో పూర్తిగా దెబ్బతింది.వెంకటేశ్వర్లు తన పొలంలో సుమారు మూడు ఎకరాల్లో అరటి తోటను సాగు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి అరటి మొక్కలు పూర్తిగా ఒరిగిపోయి నేలమట్టమయ్యాయి. పంట చేతికందే సమయంలో తోట దెబ్బతినడంతో రైతు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. అరటి మొక్కలు పెద్ద సంఖ్యలో నేలకొరగడంతో పెట్టుబడి మొత్తం వృథా అయ్యే పరిస్థితి ఏర్పడిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ , రైతు సంఘం నాయకుడు హనుమారెడ్డి నష్టపోయిన అరటి తోటను పరిశీలించారు. రైతు తిప్పన బోయిన వెంకటేశ్వర్లు,నరసయ్య,కొత్త వెంకటేశ్వర్లు, కాసా నరసయ్యను పరామర్శించి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని 50 వేలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్రంగా అంచనా వేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా అరటి వంటి ఉద్యాన పంటలకు పెట్టుబడి అధికంగా ఉంటుందని, పంట పూర్తిగా దెబ్బతిన్న రైతులకు ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతుల వివరాలను అధికారులు వెంటనే నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని, పరిహారం అందించడంలో జాప్యం చేయకూడదని ఆయన పేర్కొన్నారు.రైతులు నష్టాల్లో ఉన్న సమయంలో ప్రభుత్వం వారికి భరోసా కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో , సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య, సీపీఐ మండల కార్యదర్శి మన్నె సాంబశివరావు,పుల్లల చెరువు మండల కార్యదర్శి జి వి గురునాథం,నాయకులు రైతులు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితిని జాతీయ విపత్తు గా ప్రకటించాలి

## కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలు మంజూరు చేసి కరువు నివారణ చర్యలు వెంటనే ప్రారంభించాలి

## రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 16**

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితిని జాతీయ విపత్తుగా ప్రకటించి, కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలు మంజూరు చేసి, కరువు నివారణ చర్యలు వెంటనే ప్రారంభించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం యర్రగొండపాలెం మండలంలోని గంగాపాలెం గ్రామంలో ఎల్ నినో ప్రభావంతో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పొలాలు ఎల్ నినో ప్రభావంతో బీడు భూములు గా మారాయని అన్నారు. వర్షం పడితే పంట వేయాలనే ఆశతో రైతులు ఉన్నారని ఆయన తెలిపారు. బక్కయ్య అనే రైతు రెండు ఎకరాలు మొక్కజొన్న వేసి అర్ధ కిలోమీటరు దూరం నుంచి నీరు నడిపి డ్రిప్ ద్వారా నీరు అందించినా పంట చేతికి అందలేదన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక బోరు బావులు అడుగంటి పోయాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కారువు నివారణ చర్యలు వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కనీస వర్షపాతం నమోదు కాలేదని . రాష్ట్రంలో 54.7 శాతం మాత్రమే వర్షపాతం నమోదైందని అన్నారు. ఎల్ నినో ప్రభావంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పశువులకు పశుగ్రాసం లేక వలసలు పోతున్నారని అన్నారు. వెయ్యి అడుగుల లోతు తొవ్వినా బోరు బావులలో చుక్క నీరు పడటం లేదని ఆయన వివరించారు . ఈ మధ్య కాలంలో చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించారు నీరు ప్రాజెక్టు వరకే పరిమితమయ్యాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరువు బారిన పడిన రైతులను ఆదుకోవాలని,నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను, రైతు కూలీలను తక్షణమే ఆదుకోవాలని ఆయన కోరారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి హనుమారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైతులు వేసిన పంటలు ఎండిపోయి పెట్టిన పెట్టుబడులు కూడా రావటం లేదని అన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే నీళ్లు వస్తాయని ఈ ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయి ప్రారంభించారు కానీ వెలుగొండ ఆయకట్టు ప్రాంతాలకు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో వివరణ చెప్పాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణ గౌడ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేవండ్ల శ్రీనివాస్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య, సీపీఐ మండల కార్యదర్శి మన్నె సాంబశివరావు, ఏఐటీయూసీ నాయకులు వై వెంకట శివయ్య, సీపీఐ నాయకులు నక్కా తిరుపతయ్య, రైతులు బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



## విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరికి అందాలి

### రాష్ట్ర వైస్సార్సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 16**

విఘ్న స్వరుని ఆశీస్సులతో అందరి కష్టాలు తొలగి ప్రతి పనిలో అందరు విజయం సాధించాలని రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం సాయిబాబా గుడివద్ద, ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయకుడి విగ్రహాలను భారీ ఎత్తున ఏర్పాటు చేయడం, భక్తి శ్రద్దలతో అందరు కలిసి కట్టుగా పూజలు నిర్వహించడం సమైక్యతకు నిదర్శనమని అన్నారు. శాంతి యుత వాతావరణంలో వినాయక చవితి నిర్వహిస్తున్న కమిటీ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైస్సార్సీపీ ఉపాధ్యక్షులు ఒంగోలు మూర్తి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, నాయకులు తమ్మినేని సత్యనారాయణ రెడ్డి,,సురే వెంకట రమేష్,కొప్పర్తి ఓబుల్ రెడ్డి,సురే శ్రీను వాసులు,రమణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని, కోర్టు తీర్పులను అమలు చేయాలి

### జాయింట్ కలెక్టర్ కు అర్చకులు వినతి





**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 16**

భారత రాజ్యాంగ నిబంధనలను, సుప్రీంకోర్టు తీర్పులను కఠినంగా అమలు చేయాలని కోరుతూ మార్కాపురం కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులుకు దేవాలయాల అర్చకులు వినతిపత్రం అందజేశారు. భారత రాజ్యాంగం ప్రకారం, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం విదేశీ మతాన్ని స్వీకరించిన ఎస్సీలు హిందువులుగా పరిగణించబడరని, కాబట్టి మతం మారిన వారి కుల ధ్రువీకరణ పత్రాలను వెంటనే మార్చాలని వారు వినతిపత్రంలో కోరారు. క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వారిని ఎస్సీలుగా పరిగణించకుండా రాజ్యాంగ నిబంధనలు అమలు చేయాలని, అర్హులైన వారికి మాత్రమే రిజర్వేషన్ ఫలాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ విభాగ్ మహిళా కన్వీనర్ ఏనుగుల పద్మావతి, జిల్లా ధర్మ ప్రచారక్ అవిశినేని రమణయ్య, ఎస్సీ కాలనీల్లోని దేవాలయాల అర్చకులు పాల్గొన్నారు.

## కోటగడ్డ వినాయక స్వామి 32వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు:పెన్ పవర్ సెప్టెంబర్ 16**

పట్టణంలోని 11వ వార్డు బ్రిటన్ రోడ్డులో వినాయక చవితి పండుగ సందర్భంగా నిర్వహించిన కోటగడ్డ వినాయక స్వామి 32 వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గణనాధుని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని వర్షాలు కురిసి కుంటలు చెరువులు నిండి పంటలు పుష్కలంగా పండాలని ఆకాంక్షింఛానన్నారు. ఈ సందర్భంగా మండపం నిర్వాహకులు, స్థానిక నాయకులు, భక్తులు, మహిళలు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కి ఘన స్వాగతం పలుకుతూ శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ లొక్కు రమేష్ , ఎలిశెట్టి వెంకటప్ప , ముద్దర్ల శ్రీను, సాగనబోయిన రమేష్ , స్థానిక నాయకులు, వార్డు యువత , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వరసిద్ధి వినాయక స్వామి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డి

**కొమరోలు లోని చెక్పోస్టు 2 సమీపంలోని సిమెంట్ షాపు ప్రక్కన ఏర్పాటు చేసిన మండపాన్ని సందర్శించి పూజలు చేసిన కుందురు నాగార్జున రెడ్డి తదితరులు.**

**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 16**

కొమరోలు లోని చెక్పోస్ట్ 2 సమీపంలోని సిమెంట్ షాపు ప్రక్కన మండపంలో ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయక స్వామి పూజా కార్యక్రమాల్లో బుధవారం గిద్దలూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మార్కాపురం మాజీ శాసనసభ్యులు కుందూరు నాగార్జున రెడ్డి, కొమరోలు మండల వైసిపి పరిశీలకులు బేస్తవారిపేట మండల అధ్యక్షులు ఓసూరారెడ్డి,కొమరోలు మండల జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు, కొమరోలు వైసీపీ సీనియర్ నాయకులు నాదెళ్ల వెంకయ్య చౌదరి,కొమరోలు మండల వైసీపీ కన్వీనర్ మేరుగ రవికుమార్,వైసీపీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి చెదుళ్ళ వెంకటరమణారెడ్డి పలువురు ఎంపీటీసీలు పాల్గొని పూజలు చేశారు. వినాయక చవితి పర్వదిన వేడుకలను పురస్కరించుకొని కొమరోలు లోని చెక్పోస్ట్ 2 సమీపంలో సిమెంటు షాపు పక్కన ఆ పరిసర వీధులకు చెందిన భక్తులు ప్రత్యేక మండపాన్ని ఏర్పాటుచేసి మండపంలో విఘ్నేశ్వర స్వామి నిమజ్జన విగ్రహాన్ని సోమవారం కొలువు తీర్చారు. ఆ సందర్భంగా గత మూడు రోజులుగా గణనాథునికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు . కాగా చివరి రోజైన బుధవారం మండప నిర్వహకులు గిద్దలూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త



కుందూరు నాగార్జున రెడ్డి తో పాటు పలువురు వైసిపి నేతలను పూజా కార్యక్రమాలకు ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు బుధవారం వైసీపీ నేతలు మండపాన్ని సందర్శించి గణనాధుని ప్రత్యేక పూజలు చేశారు ఆ సందర్భంగా వేద పండితులు హరి కుమార శర్మ నేతలకుఆశీర్వచనాలు పలికి ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం మండప నిర్వహకులు ఏర్పాటుచేసిన అల్పాహార విందులో నేతలు పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో కొమరోలు ఎంపీటీసీలు ఎస్ఎం



సుభాని, మౌలాలి,ఎన్ తిరుపతి రాజు,వైసీపీ సీనియర్ నాయకులు మారం రెడ్డి రామనారాయణరెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ముత్యాల తిరుపతిరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, బాల వెంకట రెడ్డి,గోల్కొండ సుభాన్, రహమతుల్లా, నేపాలి ఖాజా, సిమెంట్ షాపు అజీమ్, తాటిచెర్ల మాజీ సర్పంచ్ బొమ్మిని వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా ప్రతినిధులు పవన్ కళ్యాణ్, అవినాష్, మండపం నిర్వాహకులు మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోషక విలువల కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలి



**పొన్నలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 16**

మండలంలోని చౌటపాలెం శింగరబోట్లపాలెం లింగంగుంట గ్రామాలలో బుధవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. రిజ్వానా మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు ఆకుకూరలు పండ్లు పాలు గుడ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థ తీసుకోవాలని తెలిపారు. సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పి సునీత, శైలజ, వాణి తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో రోడ్ల శాఖ ఉందా?

**అయోమయంగా అడుగుతున్న ప్రజలు**



**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 16**

పొదిలిలో రోడ్ల పరిస్థితి చూస్తుంటే అసలు వాటికి సంబంధించిన శాఖ ఒకటి ఉందా? అనే సందేహం ఎవరికైనా కలుగుతుంది. కొద్దిపాటి వర్షం పడిన రోడ్లపై నడవడం సాహసం గానే మారుతుందని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎక్కడో మారుమూల కాకుండా ప్రధాన రహదారుల పరిస్థితి ఈ విధంగా ఉంటే ఇక ప్రజల పరిస్థితి ఏమిటని పలువురు అడుగుతున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో గల ప్రధాన రహదారి పరిస్థితిని చూస్తే ఎవరికైనా అసలు పొదిలిలో రోడ్ల శాఖ ఉందా అనే అనుమానం కలగడం మాత్రం సహజమే! జిల్లాకు దాడి కూడలి ప్రాంతమైన పొదిలి పట్టణం నుండి వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. అంతేగాక ప్రజాప్రతినిధుల నుండి ఉన్నత స్థాయి అధికారుల వరకు ఈ రోడ్ల మీద నుండే ప్రయాణిస్తుంటారు. అయినప్పటికీ రోడ్ల పరిస్థితిని పట్టించుకున్న నాధుడే కరువయ్యారని పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కొద్దిపాటి వర్షం పడితే, రోడ్లపై నడవడం వాహనాలతో వెళ్లడం సాహసంగా మారుతుందని పలువురు ఆక్షేపిస్తున్నారు. పొదిలి పట్టణంలో రోడ్ల భవనాల శాఖకు చెందిన కార్యాలయం తో పాటు అధికారులు ఉన్నప్పటికీ, తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మోకాలు గుంటలతో నిండిన రోడ్లపై వాహనాలతో వెళ్లడం కష్టసాధ్యంగా మారుతుందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు మొద్దు నిద్రను వీడి, ప్రధాన రహదారుల పరిస్థితిని చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

## ఫోటోగ్రఫీ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా ఫోటోగ్రాఫర్లకు ప్రాధాన్యత

**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 16**

ఆంధ్రప్రదేశ్ ఫోటోగ్రఫీ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ప్రమాణ స్వీకార మహోత్సవంలో మార్కాపురం జిల్లాకు చెందిన ఫోటోగ్రాఫర్లకు కీలక పదవులు దక్కాయి.కాకినాడలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుండి ఫోటోగ్రాఫర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. మార్కాపురం జిల్లా నుండి ఎన్నికైన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వలి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా వెంకట్ తాడి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఖాసీం వలి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రవి పొదిలి ఎన్నికయ్యారు. మార్కాపురం జిల్లా నుండి నలుగురు ఫోటోగ్రాఫర్లు రాష్ట్రస్థాయి కీలక పదవులకు ఎన్నికవడం పట్ల జిల్లా ఫోటోగ్రాఫర్లు హర్షం వ్యక్తం చేసారు. వీరి ఎన్నికతో జిల్లాలో ఫోటోగ్రఫీ రంగ అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని పలువురు ఆకాంక్షించారు.




# అయ్యలూరివారిపల్లెలో లడ్డు, కలశం పాటలకు విశేష స్పందన

**రూ.30.01 లక్షలకు లడ్డు పాటను దక్కించుకున్న ముత్యాల వెంకట సుబ్బారెడ్డి**

**కలశం వేలంపాటలో రూ.21.01 లక్షలకు కైవసం చేసుకున్న లక్ష్మీనారాయణ రెడ్డి**





**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 16**

మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకల ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన గణేశుని నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన అయ్యలూరివారిపల్లి వినాయక లడ్డూ వేలంపాటకు ఈ ఏడాది కూడా విశేష స్పందన లభించింది. వినాయక స్వామి లడ్డూ వేలంపాటను మాజీ జడ్పిటిసి సీనియర్ టిడిపి నాయకులు ముత్యాల వెంకట సుబ్బారెడ్డి అత్యధికంగా రూ.30,01,116 పాట పాడి గణేశుని లడ్డూను దక్కించుకున్నారు. అదే విధంగా స్వామివారి కలశం వేలంపాటలో పాలగుళ్ల లక్ష్మీనారాయణరెడ్డి రూ. 21,01,116లకు పాట పాడి కలశాన్ని కైవసం చేసుకున్నారు. ఈ వేలంపాటలో గ్రామస్థులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది.వేలంపాట అనంతరం లడ్డూ, కలశాన్ని దక్కించుకున్న ముత్యాల వెంకట సుబ్బారెడ్డి, పాలగుళ్ల లక్ష్మీనారాయణరెడ్డిని వినాయక కమిటీ నిర్వాహకులు, గ్రామస్థులు అభినందించారు. గణేశుని లడ్డూ వేలంలో భారీ మొత్తం పలకడం పట్ల కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వినాయక స్వామి విగ్రహాన్ని ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి నామస్మరణ తో యువకులు కేరింతల మధ్య నిమజ్జనానికి తరలించారు బ్యాండ్ మేళాలు మంగళ వాయిద్యాలు టపాసుల శబ్దాల మధ్య సాగిన ఊరేగింపు గ్రామస్తులను ఆకట్టుకుంది భక్తులు గణేష్ కి జై కొడుతూ భక్తి గీతాలతో ఉత్సాహంగా ముందుకు సాగారు ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించి సంప్రదాయబద్ధంగా నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వినాయక చవితి వేడుకలను విజయవంతంగా నిర్వహించిన విఘ్నేశ్వర కమిటీ సభ్యులకు గ్రామస్తులు అభినందించారు.

## వెలుగొండ ప్రాజెక్టును సందర్శించిన కామనబోయిన వెంకటస్వామి



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 16**

పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల చిరకాల సాగునీటి, తాగునీటి అవసరాలను తీర్చే వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని అందుబాటులోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మండల తెలుగు యువత అధ్యక్షుడు కామనబోయిన వెంకటస్వామి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన వెలుగొండ ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు పరిధిలోని నీటి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ దశాబ్దాలుగా పశ్చిమ ప్రాంత ప్రజలు సాగునీరు, త్రాగునీటి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి నీటిని అందుబాటులోకి తీసుకురావడం పట్ల పశ్చిమ ప్రాంత రైతులు సంతోష వ్యక్తం చేస్తున్నారన్నారు వెలుగొండ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందడంతో పాటు రైతుల జీవన పరిస్థితుల్లో మార్పు వస్తుందన్నారు కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నియోజకవర్గంలోని సాగునీటి అవసరాలపై నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు వెలుగొండ ప్రాజెక్ట్ సందర్శించిన వారిలో నారాయణ, నాగేష్ సూర్య ప్రకాష్, తోకల రమణయ్య తదితరులు ఉన్నారు.

## ఇందిరాగాంధినే ఎదురొడ్డి నిలిచిన ధైర్యశాలి కామ్రేడ్ సీతారాం ఏచూరి

***సంతాప సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి జీవి కొండారెడ్డి ఉద్బోధ***





**గుడ్లూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**

నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీనే ఎమర్జెన్సీ సమయంలో, మీరు ప్రధానమంత్రిగా దిగిపొండి అని ఆమె ఎదురు నిలిచి మాట్లాడిన ధైర్యశాలి, కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవి కొండారెడ్డి అన్నారు. బుధవారం గుడ్లూరు మండల కేంద్రంలో సీపీఎం శాఖ కార్యదర్శి గుత్తి మల్లికార్జున అధ్యక్షతన, సంతాపసభ జరిగినది. ఈ సభలో కామ్రేడ్ కొండారెడ్డి మాట్లాడుతూ తన చిన్ననాటి నుంచే అభ్యుదయ భావాలతో పెరిగి పై చదువుల కోసం ఢిల్లీ వెళ్లి జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలో , గోల్డ్ మెడల్ సాధించిన ఉన్నత వ్యక్తి అని కొనియాడారు. జె.ఎన్.యూ యూనివర్సిటీలో విద్యార్థి సంఘ ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎన్నికై విద్యార్థుల సమస్యలపై . పోరాటాలు నిర్వహించారన్నారు. 12 సంవత్సరాలు రాజ్యసభ సభ్యునిగా, భారతదేశ ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను తనదైన భాషలో సరళంగా వివరించారు. భారత పార్లమెంటు చరిత్రలోనే అనధికార తీర్మానం ప్రవేశపెట్టి నెగ్గిన చరిత్ర కామ్రేడ్ సీతారాం ఏచూరి కి ఉందని ఆయన కొనియాడారు. విదేశీ వ్యవహారాలు చాలా చక్కగా నిర్వహించేవారు అని, శ్రీలంక నేపాల్ తదితర దేశాలతో సన్నిహిత సంబంధాలు కలిగి వారికి రాజ్యాంగం ఎలా ఉండాలో తగు సూచనలు సలహాలు ఇచ్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సీపీఎం ప్రతిష్టను పెంచడంలో కీలకంగా పని చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం, గుడ్లూరు మండలంలో రాబోయే పంచాయితీ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసి గణనీయమైన విజయాలు సాధించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ జీవి కొండారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గుడ్లూరు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, సిపిఎం సీనియర్ నాయకులు మద్దిశెట్టి జాలయ్య, సిపిఎం శాఖా కార్యదర్శులు కొట్టే వెంకయ్య, గుత్తి మల్లికార్జున, సుంకర విజయలక్ష్మి, సిపిఎం మండల కమిటీ నాయకులు వర్ధినేనీ సిద్దయ్య, సీనియర్ నాయకులు దామా కృష్ణయ్య, పాలకుర్తి నాగేశ్వరరావు, ఎం.వెంకటేశ్వర్లు, బీరకాయల వెంకటేశ్వరరావు, డి.బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు





**పెద్ద దోర్నాల పెన్ పవర్ సెప్టెంబర్ 16**

మండల కేంద్రంలోని శ్రీరంగ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు డాక్టర్ కాశీ రావు ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదినం పురస్కరించుకొని సంస్కృతి సేవా సమితి ధర్మవరం జన్మదిన వేడుకలలో భాగంగా దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు 200 మంది విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే 1000 మంది విద్యార్థులు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు, శ్రీ రంగ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మేరకు వైద్యులు కాశి రావు మాట్లాడుతూ సత్య కుమార్ ట్రస్ట్ ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని.విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల పై అవగాహన పెంచుకోవాలన్నారు , తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది మరియు మార్కాపురం జిల్లా ఎన్ డబ్ల్యూ ఎస్ చైర్మన్ తంగిరాల అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# కొమరోలు మండలంలో ఎంపిటిసి,జడ్పిటిసి ఎన్నికలకు అదనంగా ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కు ప్రతిపాదనలు

## కొమరోలు మండలంలో 35 నుంచి 40 కేంద్రాలుగా పెరగనున్న పోలింగ్ కేంద్రాలు





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబరు 16**

కొమరోలు మండలంలో ఎంపిటిసి జడ్పిటిసి స్థానాల ఎన్నికల కొరకు మరో ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు పంపించనున్నట్లుగా కొమరోలు ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు. ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా సిద్ధం చేయుటకు వీలుగా మండలంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు సూచనలు, అభ్యంతరాలు పొందేందుకు వీలుగా బుధవారం కొమరోలు లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీడీవో రమేష్ బాబు మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన ఎంపీటీసీ జడ్పిటిసి స్థానాల ఎన్నికల కొరకు మండలంలో 35 పోలింగ్ కేంద్రాలు ఉండేవని తెలిపారు. రాబోవు ఎంపీటీసీ జడ్పిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు మండలంలో మరో ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లుగా ఆయన తెలిపారు. వాటిలో తాటిచెర్ల, బ్రాహ్మణపల్లి,కొమరోలు, మధవపల్లి,చింతలపల్లి గ్రామాలలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఐదు పోలింగ్ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేయుటకు నిర్ణయించినట్లుగా ఆయన చెప్పారు. కొమరోలు మండలంలో మొత్తము 33621 మంది ఓటర్లు ఉండగా, వారిలో 16,834 మంది పురుష ఓటర్లు, 16787 మంది మహిళా ఓటర్లు ఉన్నారని మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సయ్యద్ కలిముల్లా ఖాద్రి తెలిపారు, ఎస్సీ కులాలకు చెందిన మొత్తం ఓటర్లు 5705 మంది ఉండగా, వారిలో పురుష ఓటర్లు 2867 మంది కాగా మహిళా ఓటర్లు 2,838 మంది ఉన్నారని, అలాగే ఎస్టీ కులాలకు చెందిన మొత్తం ఓటర్లు 113 మంది ఉండగా వారిలో పురుష ఓటర్లు 57 మంది, మహిళా ఓటర్లు 56 మంది ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఇక బీసీలకు చెందిన మొత్తం ఓటర్లు 17604 మంది ఉండగా వారిలో పురుష ఓటర్లు 8794 మంది మహిళా ఓటర్లు 8810 మంది ఉన్నారని ఆయన వివరించారు. మండలంలో మరోవైపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించనున్నామని వాటిపై ఏవైనా అభ్యంతరాలు సూచనలు సలహాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీవో రమేష్ బాబు రాజకీయ పార్టీల ప్రతినిధులును కోరారు. తాటిచెర్ల గ్రామంలో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాలు ఒకే భవనంలో కాకుండా ఓటర్లకు అనుకూలంగా ఉండే విధంగా అదనపు పోలింగ్ కేంద్రాన్ని సమీపంలోని పాత గ్రామ సచివాలయ భవనంలో ఏర్పాటు చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ సూచించారు. అలాగే కొమరోలు ఏర్పాటు చేసే అదనకు పోలింగ్ కేంద్రంతోపాటు మండలంలో అదనంగా ఏర్పాటు చేసే ఐదు పోలింగ్ కేంద్రాలను ఓటర్లకు అనుకూలంగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించిన విధంగా నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తామని ఎంపీడీవో వివరించారు. ఆ కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సయ్యద్ కలిముల్లా ఖాద్రి,తెలుగుదేశం పార్టీ ప్రతినిధులుగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బిజ్జాల తిరుమలరెడ్డి, చింతలపల్లి పంచాయతీ కన్వీనర్ సారే ఎల్లాల నాయుడు , కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి,తాటిచెర్ల క్లస్టర్ ఇంచార్జి పందనబోయిన భూపాల్, వైసిపి పార్టీ ప్రతినిధిగా కొమరోలు మండల వైసీపీ కన్వీనర్ మేరీగ రవికుమార్, జనసేన పార్టీ ప్రతినిధిగా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, కొమరోలు మండల కన్వీనర్ గజ్జలకొండ నారాయణ, భారతీయ జనతా పార్టీ ప్రతినిధులుగా కొమరోలు మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు వడ్డీ వెంకట్రామిరెడ్డి,మండల కన్వీనర్ వై మురళి తదితరులు పాల్గొన్నారు.

# చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు



**వలేటివారిపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 16**

పోకూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీగలు కిందకు జారిపోవడంతో పిల్లలు, వృద్ధులు, పశు వులకు ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. చిన్న గాలి వీచినా తీగలు ఊగుతూ నిప్పురవ్వలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగేలోపు స్పందించి తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

# కొమరోలు మండలంలో పోటా పోటీగా సాగిన వరసిద్ధి వినాయక స్వామి లడ్డు వేలం పాటలు

**కొమరోలు లోని ప్రధాన ఆలయం వద్ద సాగిన వేలంపాటలో 50 వేల రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్న ఉపాధ్యాయులు పులిగోటి సుబ్బరాయుడు.**

**చెక్పోస్ట్ 2 సమీపంలోని సిమెంట్ కొట్టు పక్కన నిర్వహించిన వేలంపాటలో 56 వేల రూపాయలు పాట పాడి స్వామి వారి లడ్డు కైవసం చేసుకున్న అక్కల రెడ్డి మోహన్ రెడ్డి.**





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 16**

వినాయక చవితి పర్వదిన వేడుకల సందర్భంగా నిమజ్జనం రోజున కొమరోలు మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించిన వరసిద్ధి వినాయక స్వామి వేలం పాటలు భక్తులు పోటాపోటీగా పాల్గొని అధిగమొత్తాలకు గణనాధుని లడ్డు ను కైవసం చేసుకున్నారు. బుధవారం నిర్వహించిన వేలంపాటలలో భాగంగా కొమరోలు లోని చెక్పోస్ట్ 2 సమీపంలోని వెంకటరెడ్డి సిమెంట్ షాపు ప్రక్కన ఏర్పాటుచేసిన మండపంలో నిర్వహించిన వేలంపాటలో అక్కల రెడ్డి మోహన్ రెడ్డి అనే భక్తుడు స్వామి వారి లడ్డును 56 వేల రూపాయలకు కైవసం చేసుకున్నాడు అలాగే కొమరోలు లోని ప్రధాన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహించిన వేలంపాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా వరసిద్ధి వినాయక స్వామి లడ్డును ఉపాధ్యాయుడు పులిగోటి సుబ్బరాయుడు 50 వేల రూపాయలకు కైవసం చేసుకున్నారు. కొమరోలు లోని పాతాళగడ్డ వీధిలో నిర్వహించిన వేలంపాటలో పులిగోటి సుబ్బరాయుడు 15,000 రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. చెక్ పోస్ట్ 1 సమీప మండపంలో నిర్వహించిన వేలంపాటలు పునుగుపాటి నరసింహులు 17500 రూపాయలకు లడ్డును కైవసం చేసుకున్నారు బ్రాహ్మణ బజార్లు నిర్వహించిన వేలంపాటలో చంద్రశేఖర్, రంగా వేలం పాట పాడి స్వామి వారి లడ్డును 4500 రూపాయలకు కైవసం చేసుకున్నారు. బ్రహ్మంగారి మఠము వీధిలో నిర్వహించిన వేలం పాటలో కంబాల జయరాములు ఎనిమిది వేల రూపాయలకు స్వామివారి లడ్డును పొందారు. బొడ్డువానిపల్లిలో నిర్వహించిన వేలం పాటలు ఆ గ్రామానికి చెందిన జశ్విత అనే చిన్నారి తమ తండ్రి సహకారంతో 43 వేల రూపాయలకు స్వామివారిని కైవసం చేసుకున్నారు.అక్క పల్లెలో నిర్వహించిన వేలంపాటలో ఆ గ్రామానికి చెందిన డీ పుల్లయ్య నాయుడు 40 వేల రూపాయలకు లడ్డును పొందారు. రెడ్డి చర్ల నిర్వహించిన వేలంపాటలో అశోక్ బాబు 70116 రూపాయలకు స్వామివారి లడ్డును కైవసం చేసుకున్నారు.

# మోదీ జన్మదినోత్సవం సందర్భంగా నేడు నల్లమలలో ఉచిత మెగా వైద్య శిబిరం.. ప్రారంభించనున్న కలెక్టర్

## సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా కొర్రపోలు తండాలో వైద్య సేవలు -బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి.

**పెద్ద దోర్నాల పెన్ పవర్ సెప్టెంబర్ 16**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని నల్లమల అటవీ ప్రాంతమైన కొర్రపోలు తండాలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. లీ ఫౌండేషన్, ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ వైద్య శిబిరం ద్వారా నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు, మారుమూల గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు, అవసరమైన మందులను అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత ప్రారంభించనున్నారు. జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఆర్డీవో శివరామిరెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబుతో పాటు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొననున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అంత్యోదయ స్ఫూర్తితో సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సేవలు అందించాలనే



లక్ష్యంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రరెడ్డి తెలిపారు.. మారుమూల నల్లమల అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు వైద్య సేవలు సులభంగా అందుబాటులో ఉండే పరిస్థితులు తక్కువగా ఉంటాయని, అందుకే ప్రజల వద్దకే వైద్య సేవలను తీసుకెళ్లాలనే ఉద్దేశంతో కొర్రపోలు తండాలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు.. ప్రధాని నరేంద్ర మోదీ దేశసేవకు తన జీవితాన్ని అంకితం చేశారని డాక్టర్ ఏలూరి రామచంద్రరెడ్డి అన్నారు. దేశంలోని పేదలు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, అట్టడుగు స్థాయి ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. మోదీ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించడమే ఆయన జన్మదినోత్సవానికి నిజమైన స్ఫూర్తిదాయకమైన వేడుక అని తెలిపారు. నల్లమల ప్రాంతంలోని గిరిజన కుటుంబాలకు వైద్య సేవలు అందించడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# భక్తిశ్రద్ధలతో కోలాహలంగా నిర్వహించిన గణేష్ నిమజ్జన శోభా యాత్ర





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 16**

కొమరోలు పట్టణంలో బుధవారం గణేష్ నిమజ్జన శోభాయాత్ర కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలు కోలాహలంగా సాగాయి వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం వినాయక చవితి పర్వదినాన్ని మండలంలోని హిందువులు ఘనంగా నిర్వహించుకున్నారు.ఆ సందర్భంగా కొమరోలు పట్టణంలో దాదాపు 20 వీధులలో వినాయక మండపాలు ఏర్పాటు చేసి నిమజ్జన గణనాథుల విగ్రహాలను ప్రతిష్టించారు. ఆ సందర్భంగా గత మూడు రోజులుగా గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. కాగా మూడవ రోజు అయిన బుధవారం గణనాథుని విగ్రహాలను నిమజ్జనానికి తరలించే కార్యక్రమాలు నిర్వహించారు. మండపాలలోని గణనాథుల విగ్రహాలను ప్రత్యేక ట్రాక్టర్లలలో అలంకరించి మేళతాళాలతో, బాణసంచా కాల్పులతో,యువతి యువకుల కేరింతలతో, రంగులు చల్లుకుంటూ నిమజ్జనా యాత్ర సాగించారు..కొమరోలు లోని ప్రధాని ఆర్ అండ్ బి రోడ్డు పొడవునా గణనాథుల విగ్రహాలతో ఏర్పాటు చేసిన ట్రాక్టర్లు ర్యాలీగా బయలుదేరడంతో ప్రధాన వీధి శోభాయమానంగా మారింది. వినాయక మండపాలలో వరసిద్ధి వినాయక స్వామి లడ్డు వేలంపాటలు నిర్వహించగా భక్తులు అధికంగా వేలం పాట పాడి వరసిద్ధి వినాయక స్వామి లడ్డును కైవసం చేసుకున్నారు. గణనాథులవి విగ్రహాలు ఏర్పాటు చేసిన అన్ని వీధిలోని ట్రాక్టర్లు కొమరోలు లోని నాలుగు రోడ్ల కూడలిలో గల వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్దకు చేరుకొని అక్కడ నుంచి నిమజ్జనానికి తరలి వెళ్లాయి.నిమజ్జన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా స్థానిక ఎస్సై కే నాగేంద్ర రావు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. వినాయక చవితి పర్వదినంతోపాటు నిమజ్జనా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సవాలతో, కోలాహలంగా, ప్రశాంతంగా ముగియటం పట్ల ఆలయ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

# పొదిలిలో వినాయక విగ్రహాన్ని సందర్శించుకున్న ముస్లిం నాయకులు



**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 16**

పొదిలి పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని పలువురు ముస్లిం నాయకులు సందర్శించుకున్నారు. పట్టణంలోని ఓబుల శెట్టి వారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక స్వామిని దర్శించుకున్న ముస్లిం నాయకులు అక్కడి భక్తులకు తమ శుభాకాంక్షలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు విభాగపు తెలుగుదేశం ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, అధికార ప్రతినిధి షేక్ యాసిన్ తోపాటు అంకిత మోహన్ రావు, బండి నాగార్జున, ఎన్ ప్రసాద్, బి వెంకటరావు, పొదిలి యువకాకునాడు అధ్యక్షులు మలిశెట్టి సందీప్, షేక్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుని లడ్డూ వేలం పాట రూ.1.75 లక్షలు

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 16**

గిద్దలూరులో ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్నారు మాయాబజార్‌లో పశువుల ఆసుపత్రి ఎదురుగా ఉన్న వీధిలో వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుని ప్రతిమను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గత మూడు రోజులుగా వీధి ప్రజలు, భక్తులు, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన వినాయకుని లడ్డూ వేలం పాట ఉత్సాహంగా సాగింది. ఈ వేలం పాటలో చెల్లగొల్ల అరవింద్ రూ.1,75,000లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ విషయాన్ని కమిటీ సభ్యులు యం. సత్యనారాయణ రెడ్డి తెలిపారు. వేలం పాట సందర్భంగా భక్తుల్లో ఉత్సాహం నెలకొంది. అనంతరం వినాయకుని నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వీధి ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జాతీయ గర్వం అహంకారంగా మారితే.. గెలుపుకు ప్రాధాన్యత ఉండదు:

## భారత్ ట్రోఫీ నిరాకరణపై మహమ్మద్ యూసఫ్

**ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు**

**నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ స్వీకరించేందుకు నిరాకరించిన టీమ్**

**వినయం లేని దేశం గెలిచినా ఓడిపోయినట్టే అన్న యూసఫ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్థాన్ మంత్రి మోహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించేందుకు నిరాకరించడం తీవ్ర దుమారం రేపుతోంది. గత ఏడాది పురుషుల ఆసియా కప్ సమయంలోనూ భారత పురుషుల జట్టు నఖ్వీ నుంచి ట్రోఫీని తీసుకోకుండా సంచలన నిర్ణయం తీసుకుంది. తాజాగా భారత మహిళల జట్టు కూడా అదే బాటలో పయనించి నఖ్వీకి షాక్ ఇచ్చింది.దుబాయ్‌లో జరిగిన ఫైనల్ పోరులో శ్రీలంకపై 72 పరుగుల తేడాతో విజయం సాధించి భారత మహిళల జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. అయితే నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోకూడదనే నిర్ణయం వెనుక బీసీసీఐ ముందస్తు వ్యూహం ఉంది.

ఈ ట్రోఫీ నిరాకరణ ఘటనపై పాకిస్థాన్ మాజీ దిగ్గజ క్రికెటర్ మహమ్మద్ యూసఫ్ సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించాడు. "జాతీయ గర్వం కాస్తా అహంకారంగా మారినప్పుడు, గెలుపునకు ఏమాత్రం ప్రాధాన్యత ఉండదు. జట్టు గెలవవచ్చు, కానీ వినయం లేని దేశం ఓడిపోయినట్టే" అని ట్వీట్ చేశాడు.మోహ్సిన్ నఖ్వీని ప్రశంసిస్తూ యూసఫ్ చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ట్రోఫీ తీసుకోకపోవడంపై బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా స్పందిస్తూ ఇది బోర్డు తీసుకున్న సంస్థాగత నిర్ణయమని స్పష్టం చేశారు. వేడుకల్లో పాల్గొనకూడదనే విషయాన్ని ఏసీసీకి ముందే అధికారికంగా తెలియజేశామని ఆయన వెల్లడించారు. గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి, ఆ తర్వాత చోటుచేసుకున్న సైనిక ఉద్రిక్తతల దృష్ట్యా దేశప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇది ఆటగాళ్లకు లేదా క్రీడకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలోని వ్యూహాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.

# ఫ్రాంచైజీల విజ్ఞప్తి.. ఇకపై ఇండియాలోనే ఐపీఎల్ మినీ వేలం

**స్వదేశానికి తిరిగి రానున్న ఐపీఎల్ మినీ వేలం**

**ఫ్రాంచైజీల విజ్ఞప్తితో పాలకమండలి నిర్ణయం**

**2024 నుంచి దుబాయ్, జెడ్డా వంటి నగరాల్లో వేలం**

**వేదికపై ఇంకా రాని స్పష్టత**

**ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌పై కొనసాగుతున్న చర్చ**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మినీ వేలాన్ని తిరిగి భారత్‌లోనే నిర్వహించాలని ఐపీఎల్ పాలకమండలి (జీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్నేళ్లుగా విదేశాల్లో నిర్వహిస్తున్న ఈ సంప్రదాయానికి స్వస్తి పలకాలని మంగళవారం జరిగిన పాలకమండలి సమావేశంలో తీర్మానించారు. 2024 నుంచి ఐపీఎల్ వేలాన్ని దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే, మినీ వేలం కోసం తమ బృందాలను విదేశాలకు తరలించడం రవాణా పరంగా, నిర్వహణాపరంగా సవాలుగా మారుతోందని ఫ్రాంచైజీలు ఆందోళన వ్యక్తం చేశాయి. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న గవర్నింగ్ కౌన్సిల్, 2027 మినీ వేలాన్ని భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, వేలం నిర్వహించే నగరాన్ని ఇంకా ఖరారు చేయలేదు. పెళ్లిళ్ల సీజన్ దృష్ట్యా హోటల్ గదుల లభ్యతను బట్టి వేదికను ఖరారు చేయనున్నారు. మినీ వేలాన్ని భారత్‌కు మార్చినప్పటికీ, ఆ తర్వాతి ఏడాది జరిగే మెగా వేలాన్ని మాత్రం విదేశాల్లోనే నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఇదే సమావేశంలో 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనపై కూడా పాలకమండలి సుదీర్ఘంగా చర్చించింది. ఈ నిబంధనపై ఫ్రాంచైజీల నుంచి అభిప్రాయాలను స్వీకరించి, తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనుంది.

# 2027 ప్రపంచకప్ గెలవాలంటే ఆ తప్పులు చేయొద్దు.. టీమిండియాకు యువరాజ్ కీలక సలహా



**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా చేసుకుని భారత జట్టు యాజమాన్యానికి మాజీ ఆల్-రౌండర్, 2011 ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్ కీలకమైన సలహాలు ఇచ్చాడు. టోర్నమెంట్‌కు ముందు చివరి నిమిషంలో జట్టులో భారీ మార్పులు చేయడం మానుకోవాలని, ఇప్పటి నుంచే ఒక కోర్ జట్టును గుర్తించి వారిపై నమ్మకం ఉంచాలని సూచించాడు. దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళితేనే విజయం సాధ్యమవుతుందని స్పష్టం చేశాడు.క్రిక్‌ఇన్ఫోతో మాట్లాడుతూ యువరాజ్ సింగ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. "భారత జట్టు కీలక టోర్నీలలో విఫలమైన ప్రతీసారి, దానికి కారణం చివరి నిమిషంలో భారీ మార్పులు చేయడమే. కాబట్టి 2027 ప్రపంచకప్ గెలవగలదని మనం నమ్మే జట్టును ఎంచుకుని, టోర్నీ వరకు వారికే అండగా నిలవడం చాలా ముఖ్యం. వారు గెలిచినా, ఓడినా జట్టుపై నమ్మకం ఉంచాలి" అని యువరాజ్ వివరించాడు.ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న తరుణంలో 50 ఓవర్ల మ్యాచ్‌ల సంఖ్య తగ్గిపోయిందని యువీ గుర్తుచేశాడు. అందువల్ల ఎంపిక చేసిన ఆటగాళ్లకు తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించాలంటే, రాబోయే ఏడాది కాలంలో వారికే స్థిరంగా అవకాశాలు కల్పించాలని అన్నాడు. 12 నుంచి 14 మందితో కూడిన అత్యుత్తమ జట్టును ఎంపిక చేసుకుని, మైదానం, పరిస్థితులకు అనుగుణంగా తుది జట్టులో ఒకటి రెండు మార్పులు చేయవచ్చని తెలిపాడు.గతంలో ఆస్ట్రేలియా జట్టు ప్రపంచకప్‌లు గెలవడానికి కారణం వారి జట్టులో మ్యాచ్ విన్నర్లు ఉండటమేనని యువరాజ్ ఉదహరించాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించగల సత్తా ఉన్న ఆటగాళ్లను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని సూచించాడు.

ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు కూడా ఇదే విధానాన్ని అనుసరించిందని, స్థిరమైన జట్టుతో బరిలోకి దిగడం వల్లే విజయం సాధ్యమైందని యువీ విశ్లేషించాడు. 2027 ప్రపంచకప్ కోసం కూడా ఇదే తరహా వ్యూహంతో ముందుకు సాగాలని జట్టు యాజమాన్యానికి సలహా ఇచ్చాడు.

# ట్రెండీ టాక్: 50 ప్లస్ హీరోలకు 'ఇరుముడి' నేర్పిన పాఠం





సినిమా రంగంలో స్టార్ హీరోల వయసు మారుతున్న కొద్దీ వారి పాత్రల ఎంపికలోనూ పరిణతి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మరోసారి ప్రూవ్ అయింది. తమ వయసుకు తగిన పాత్రలు చేస్తేనే ఎంత పెద్ద హీరోనైనా ప్రేక్షకులు తెరపై ఆదరిస్తారని.. లేదంటే ప్రేక్షకుల నుంచి ఘోరమైన తిరస్కారం తప్పదని గత పరిణామాలు స్పష్టం చేసాయి. రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు బిగ్ డిబేట్ కి కారకం. పెళ్లీడుకొచ్చిన కూతుళ్లు ఉన్నప్పటికీ ఇంకా యువ హీరోయిన్లతో రొమాంటిక్ లవ్‌స్టోరీల్లో నటిస్తున్న 60 ప్లస్ హీరోలకు ఇదొక పెద్ద కనువిప్పు లాంటి పరిణామం. మన పరిశ్రమలో ఉన్న 50 ప్లస్ హీరోలు ఇకపై రొమాంటిక్ పాత్రలను పక్కన పెట్టి.. కథకు బలమైన డాడీ పాత్రల్లో.. బాధ్యతాయుతమైన రోల్స్‌లో నటించాల్సిన సమయం ఆసన్నమైంది.ఇప్పటివరకు ఇద్దరేసి హీరోయిన్లతో ప్రేమలో నిండా మునిగి, రొమాన్స్ చేయడంలో బిజీగా ఉన్న మాస్ మహారాజా రవితేజ ఇటీవల -ఇరుముడి- చిత్రంలో మొదటిసారి కూతురిని అమితంగా ప్రేమించే బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో నటించారు. తెరపై ఆయనలోని ఈ విప్లవాత్మక మార్పును ప్రేక్షకులు ఎంతో మనసారా స్వాగతించారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథా బలం ఉన్న తండ్రి పాత్రను ఎంచుకోవడం వల్ల ఆ సినిమా ఘనవిజయం సాధించడమే కాకుండా.. నటుడిగా అతడి మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది.ఈ విజయంతో 50 ప్లస్, 60 ప్లస్ హీరోలందరూ ఇకపై తమ వయసుకు తగిన పాత్రలనే ఎంచుకోవాల్సి ఉంటుందనే సూచన స్పష్టంగా కనిపిస్తోంది. ఇండస్ట్రీ దిగ్గజ హీరోలైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్‌లు ఇప్పటికే చాలావరకు తమ వయసుకు తగినట్లు పరిణతి ఉన్న విభిన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ దూసుకెళుతున్నారు. నాగార్జున సైతం ప్రయోగాత్మక కంటెంట్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. 'ఇరుముడి' తరహాలో భావోద్వేగాలతో కూడిన తండ్రి పాత్రలు ఈ సీనియర్ హీరోలందరికీ కూడా వందశాతం సూటబుల్ ఆప్షన్‌గా మారుతున్నాయి.



అలా కాకుండా పాత పద్ధతిలోనే ఇంకా హీరోయిన్లతో లవ్వాయణాలు, రొమాంటిక్ కామెడీలు చేస్తూ పోతే నేటి ప్రేక్షకులు నిర్ధయంగా తిరస్కరిస్తున్న ఉదాహరణలు చూస్తూనే ఉన్నాం. నేటి మాస్ ఫ్యాన్స్ కూడా ఓటీటీలు, వెబ్ సిరీస్‌లు, హాలీవుడ్ సినిమాలు, లైవ్ సిరీస్ లు విపరీతంగా చూస్తూ పూర్తిగా అప్‌గ్రేడ్ అయ్యారు. వారి అభిరుచులు మారడంతో రొటీన్ కమర్షియల్ ఫార్ములా సినిమాలు బెడిసికొడుతున్నాయి. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, షారూఖ్ ఖాన్ వంటి దిగ్గజాలు కూడా గ్లామర్ పాత్రలను పక్కన పెట్టి తమ వయసుకు తగ్గ పరిణతి ఉన్న తండ్రి లాగానో లేదా వయసుకు తగ్గ పాత్రల్లోను నటిస్తుండటం గమనార్హం.మొత్తానికి ఏజ్ పెరుగుతున్న కొద్దీ స్టార్ హీరోలు తమ పంథాను మార్చుకోవాల్సిన టైమ్ వచ్చేసింది. హాలీవుడ్ హీరోల మాదిరిగా మారుతున్న కాలానికి తగినట్లు తమ ఇమేజ్‌ను అప్‌గ్రేడ్ చేసుకుంటూ.. వైవిధ్యమైన పాత్రలతో మైలేజ్ పెంచుకోవడమే సీనియర్ హీరోలకు సరైన మార్గం. కేవలం డ్యాన్సులు, రొమాన్స్ చుట్టూ తిరగకుండా బలమైన భావోద్వేగాలు ఉన్న క్యారెక్టర్లను ఎంచుకుంటేనే బాక్సాఫీస్ వద్ద విజయం సొంతమవుతుందని నిరూపణ అయింది. ఇరుముడి నేర్పిన పాఠం టాలీవుడ్ 50 ప్లస్ హీరోలకు నిజంగానే కలిసి వస్తుందని ఆశిద్దాం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com